నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నిజామాబాద్-కామారెడ్డి

1

శుక్రవారం | ఆగస్టు 30, 2024 | www.navatelangana.com

ట్రాఫిక్ పోలీసుల తీరేవేరు..

- చలాన్లు వేస్తున్నా.. అవగాహన మాత్రం కల్పిస్తలే..



నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ట్రాఫిక్ పోలీసులకు చలాన్ల మీద ఉన్న శ్రద్ధ.. అవగాహన కల్పించడంలో లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. అందుకు నిదర్శనం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో గురువారం ఖలీల్‌వాడీలో జరిగిన ఘటనే నిదర్శనం. ట్రాఫిక్‌ను క్లియర్ చేసే వాహనంలో వచ్చిన ట్రాఫిక్ పోలీసులు.. తమ ట్రాఫిక్ వాహనాన్ని దిగి దుకాణాల ఎదుట నిలిపి ఉంచిన వాహనదారులకు అవగాహన కల్పించాలి. కానీ కనీసం వాహనాన్ని దిగకుండా అదే వాహనంలో ఉండి చలాన్లు వేసేందుకు మాత్రం ఫొటోలు దించారు. దీన్ని చూసిన ప్రజలు 'ఇదేంటి.. ట్రాఫిక్ పోలీసుల తీరూ..' అంటూ అవాక్కయ్యారు.

మొక్కలు నాటిన జిల్లా న్యాయమూర్తి

నవతెలంగాణ-కోటగిరి

మండలంలోని ఎక్లాస్‌పూర్ గ్రామంలోని గుమ్మడి ఫౌండేషన్ అనాథాశ్రమాన్ని జిల్లా సివిల్ న్యాయమూర్తి కుంచాల పద్మావతి గురువారం ఆకస్మికంగా పరిశీలించారు. అనాథాశ్రమంలోని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అనాథాశ్రమ ఆవరణలో మొక్కలు నాటి నిర్వాహకులు మధును వివరాలు అడిగి తెలుసుకున్నారు.



మొక్కలు నాటుతున్న జిల్లా న్యాయమూర్తి పద్మావతి

ముక్కు మూయాల్సిందే



- కామారెడ్డి బస్టాండ్‌కు వెళ్తే అంతే సంగతి
- కంపు కొడుతున్న మూత్రశాలలు, మరుగుదొడ్లు
- నీటిసౌకర్యం లేక ఇబ్బందులు
- తాగునీరూ లేదు



నవతెలంగాణ-కామారెడ్డి


నిత్యం వేల మంది ప్రయాణించే కామారెడ్డి బస్టాండ్‌కు వెళ్తే ప్రయాణికులు ముక్కు మూయాల్సిందే. నీటి సౌకర్యం లేకపోవడంతో మూత్రశాలలు, మరుగుదొడ్లు కంపుకొడుతున్నాయి. తాగునీటికి సైతం నీటి కటకటే నెలకొంది.

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్‌లో నీరు లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. అంతేకాకుండా సిబ్బంది సైతం వారు భోజనాలు చేసే సమయంలో నీరు అందుబాటులో లేక ఇబ్బందులకు గురవుతున్నారు. బస్సు టికెట్ల ధరలు పెంచిన ఆర్టీసీ అధికారులు.. ప్రయాణికులకు వసతులు కల్పించడంలో విఫలమవుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. కామారెడ్డి బస్టాండ్‌కు వెళ్లాలంటేనే ముక్కు మూసుకుని వెళ్లవలసిన పరిస్థితి ఏర్పడుతుందని పలువురు ప్రయాణికులు పేర్కొంటున్నారు. మూత్రశాలలకు ఎప్పుడు తాళాలు వేస్తారో, ఎప్పుడు తెరుస్తారో ఎవరికి అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఆర్టీసీ యాజమాన్యానికి ఆదాయం మీద ఉన్న శ్రద్ధ ప్రయాణికులకు కల్పించే సౌకర్యాలపై లేదని జిల్లా కేంద్రానికి వచ్చి పోయే ప్రయాణికులు పేర్కొంటున్నారు.

ప్రతినిత్యం కామారెడ్డి బస్టాండ్‌కు వేలాదిమంది ప్రయాణికులు కరీంనగర్, వేములవాడ, హైదరాబాద్, నిజామాబాద్, ఆర్మూర్ పట్టణాల నుండే కాకుండా వివిధ ప్రధాన పట్టణాల నుంచి కామారెడ్డి చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రతినిత్యం వేలాదిమంది ప్రయాణికులు వస్తూపోతూ ఉంటారు. గతంలో అన్ని సౌకర్యాలు ఉండేవి. ప్రస్తుతం అసౌకర్యాలతో కామారెడ్డి బస్టాండ్ కొట్టుమిట్టాడుతోంది. సిబ్బంది ఉన్నా.. చెత్తను తొలగించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. కామారెడ్డి బస్టాండ్‌లో నీటి సమస్యపై కామారెడ్డి ఆర్టీసీ డిపో మేనేజర్ ఇందిరాను ఫోను ద్వారా సంప్రదించగా.. 'బోరు మోటార్ చెడిపోయింది. దానిని రెండు రోజుల్లో బాగు చేయించి నీరు అందే విధంగా చూస్తాం. మరుగుదొడ్లను ప్రైవేట్ కాంట్రాక్టర్‌కు ఇచ్చాం. వారితో మాట్లాడి దుర్వాసన రాకుండా చూస్తాం.' అని ఆమె తెలిపారు.



నీటిసౌకర్యం లేని వైనం



అపరిశుభ్రంగా మారిన మూత్రశాలలు

రైతులందరికీ రుణాలను
వెంటనే మాఫీ చేయాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్/బోధన్

రైతులందరి రుణాలను వెంటనే మాఫీ చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి ఆర్డీవో కార్యాలయంలో అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆగస్టు 15 వరకు రాష్ట్రంలో ఉన్న రైతులందరి రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించి రూ.31 వేల కోట్లకు గానూ.. రూ.18 వేల కోట్లు మాత్రమే నిధులను విడుదల చేయటంతో అనేకమంది రైతులు రుణమాఫీ కాకపోవడంతో బ్యాంకుల చుట్టూ, అధికారుల చుట్టూ తిరుగుతూ తీవ్రమైన మానసిక వేదనతో ఆందోళన చెందుతున్నారని అన్నారు. చిన్న చిన్న కారణాలు చూపుతూ ప్రభుత్వ నిబంధనలను సడలించకపోవడంతో రుణమాఫీ వర్తించటం లేదని తిరిగి దరఖాస్తులు తీసుకొని ప్రభుత్వానికి నివేదిస్తామని చెబుతున్నారని తెలిపారు. ప్రభుత్వం రుణాలు తీసుకున్నా రైతులందరికీ రెండులక్షల రూపాయలు మాఫీ చేయడానికి కావలసిన నిధులను విడుదల చేసి నిబంధనలను సడలించాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులు అందరికీ పంట పండించే వారికి ఎకరానికి రూ.15000 రైతు భరోసాను ఇస్తామని హామీనిచ్చి రెండు పంటలు గడిచినప్పటికీ రైతు భరోసా ఇవ్వలేదని వెంటనే రైతులందరికీ ఎకరానికి 15 వేల రూపాయలు రైతు భరోసాను ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ సమక్షంలో రైతుల పంటలకు అదనంగా క్వింటాల్‌కు రూ.500 చెల్లిస్తామని హామీ ఇచ్చి గత రెండు సీజన్లలో అమలు జరపలేదని, ఇప్పుడు కేవలం సన్నా వరి ధాన్యానికి మాత్రమే చెల్లిస్తామని తెలియజేస్తున్నారని దీని మూలంగా రైతులు నష్టపోతారని, అందువల్ల ఇప్పటికైనా ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేయటంతో పాటు రైతు భరోసాను, పంటలకు బోనస్ ధరను అమలు జరపాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సుజాత, నగర నాయకులు కటారి రాములు, నల్వాల నరసయ్య, కృష్ణ, సతీష్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

బోధన్ : ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన మాటకు కట్టుబడి రైతులకు తక్షణమే రెండు లక్షల రుణమాఫీ అమలు చేయాలని కోరుతూ గురువారం సిపిఐ(ఎం) ఆధ్వర్యంలో బోధన్ ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఐ(ఎం) బోధన్ పట్టణ కార్యదర్శి శంకర్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు అయిన రైతులకు ఇచ్చిన హామీ రుణమాఫీ రెండు లక్షలు అమలు కాకపోవడం సమంజసం కాదని అన్నారు. ఇప్పటికే వేలాదిమంది రైతులు రెండులక్షల రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. అధికారంలోకి రాకముందు అన్ని అమలు చేస్తామన్న ప్రభుత్వం ప్రజలు నమ్మకంతో అధికారాన్ని కట్టబెడితే ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం సరికాదని అన్నారు. ఎటువంటి షరతులు లేని రుణమాఫీని తెలంగాణ రాష్ట్రంలోని రైతులందరికీ వర్తింపజేయాలని అన్నారు. ప్రజలకు ఇచ్చిన పెన్షన్, నూతన రేషన్ కార్డులు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇతర హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేసినప్పుడే ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం ఉంటుందని అన్నారు. గత ప్రభుత్వంలా కాలయాపన చేస్తూ నమ్మకాన్ని పోగొట్టుకోవద్దని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) సీనియర్ నాయకులు గంగాధరప్ప, పత్రి ఎల్లయ్య, పోశెట్టి, నాగలక్ష్మి పాల్గొన్నారు.



కంఠేశ్వర్: ధర్నాలో మాట్లాడుతున్న నాయకులు



బోధన్: వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

పీఎంపీ, ఆర్‌ఎంపీలు
ప్రథమ చికిత్సకే పరిమితం కావాలి

- వైద్యాధికారుల హెచ్చరిక
- పలు క్లీనిక్‌లు సీజ్

నవతెలంగాణ-రామారెడ్డి/నసురుల్లాబాద్

మండలంలో ప్రథమ చికిత్స కేంద్రాలైన పిఎంపి, ఆర్ఎంపి క్లినిక్‌లపై గురువారం ప్రభుత్వ వైద్యులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు క్లినిక్ సీజ్ చేశారు. అన్నారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు మానస రెడ్డిపేటలో బొంబోతుల లక్ష్మీనారాయణ క్లినిక్‌పై దాడులు నిర్వహించి, రోగులకు గ్లూకోస్ పెట్టడం, యాంటీబయోటిక్ మందులను గుర్తించారు. రామారెడ్డిలో ప్రైవేట్ క్లీనిక్‌ను రామారెడ్డి పిహెచ్‌సీ వైద్యులు సురేష్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు సీజ్ చేశారు. మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని పిఎంపి వైద్యునికి సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు, డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు సోకిన రోగులకు వైద్యం నిర్వహించకుండా, ప్రభుత్వ ఆసుపత్రికి పంపించాలని, పరిధి దాటి వైద్యం అందిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ లచ్చిరాం, వైద్య సిబ్బంది జార్జ్, రాజు, రాణి, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

పీఎంపీలు ప్రథమ చికిత్సకే పరిమితం కావాలి..

నసురుల్లాబాద్ : గ్రామీణ ప్రాంతాల్లో పిఎంపిలు, ఆర్ఎంపీలు వారి పరిధికి మించి చికిత్సలు చేస్తే కఠిన చర్యలుంటాయని ఉమ్మడి బీర్కూర్ మండల ప్రభుత్వ వైద్యాధికారి గిరీష్ హెచ్చరించారు. గురువారం నసురుల్లాబాద్ మండలం కేంద్రంలో గత రెండు రోజులుగా ఆర్.ఎం.పి, పి.ఎం.పి చికిత్స కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బీర్కూర్ ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ గిరీష్ మాట్లాడుతూ.. ఆర్ఎంపీలు, పీఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని, వారు నిర్వహించే క్లినిక్‌లకు వచ్చేవారిని సమీపంలోని ప్రభుత్వ పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులకు పంపించాలని సూచించారు. దీనికి విరుద్ధంగా వైద్యం చేయడం, మందులు, ఇంజక్షన్ల ద్వారా చికిత్స అందించి వ్యాధి తీవ్రమైన తర్వాత ప్రభుత్వాసుపత్రులకు పంపించడం వల్ల అప్పటికే వారు నీరసించి కోలుకోలేని స్థితికి వెళుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో ఆర్థికంగా, శారీరకంగా అన్ని విధాలా నష్టపోతున్నారని వివరించారు. ఎవరైనా పీఎంపీలు, ఆర్ఎంపీలు నిబంధనలను అతిక్రమించి వైద్యం చేస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.



రామారెడ్డి : క్లీనిక్‌ను సీజ్ చేసిన ప్రభుత్వ వైద్యులు

కార్మికులపై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

- సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ డిమాండ్

నవతెలంగాణ-బోధన్

బోధన్ మున్సిపల్ పారిశుధ్య కార్మికులపై దాడి చేసిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుని, వారికి రక్షణ కల్పించాలని సీఐటీయూ, ఐఎఫ్టీయూ నాయకులు శంకర్ గౌడ్, మల్లేష్ డిమాండ్ చేశారు. గురువారం కార్మికులపై దాడిని నిరసిస్తూ మున్సిపల్ కార్యాలయం నుంచి పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బోధన్ పట్టణంలో మున్సిపాలిటీలో పనిచేసే సానిటేషన్ కార్మికులు ఉదయం అటెండెన్స్ తీసుకుని తమ విధులకు వెళ్లి పనిచేసే క్రమంలో గంజ్ ప్రాంతంలో ఇండ్ల ముందు ఉన్న డ్రైనేజీలను శుభ్రం చేస్తున్నప్పుడు రత్నం హోటల్ సమీపంలో లక్ష్మణ్ అనే వ్యక్తి భార్య సరూప, లక్ష్మణ్ కుమారుడు సానిటేషన్ కార్మికులు ఎల్లయ్య, సంతోష్‌పై కర్రతో దాడి చేశారని అన్నారు. ఎల్లయ్య చేతిలో ఉన్న కోడవలిని గట్టిగా లాగడంతో అతని చేతి వేళ్ళకు తీవ్రంగా గాయమై రక్తస్రావమైందన్నారు. కార్మికులపై దాడి చేయడమే కాకుండా కార్మికులను బూతులు తిట్టారని, దానితో కార్మికులందరూ ఐఎఫ్టీయూ - సీఐటీయూ నాయకులతో కలిసి మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ , కౌన్సిల్ సభ్యులతో కార్మికులపై జరిగిన దాడిని వివరించారు. వారు కార్మికులకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్మికుల పైన జరిగిన దాడిని ఖండించారు. అనంతరం పోలీస్ స్టేషన్ వరకు కార్మికులతో ర్యాలీగా వెళ్లి స్టేషన్ ముందు బైఠాయించారు.

కార్మికులపై దాడి చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుని కఠినంగా శిక్షించాలని, మున్సిపల్ కార్మికులకు రక్షణ కల్పించాలని కార్మిక సంఘ నాయకులు బి. మల్లేష్ (ఐఎఫ్‌టీయూ), జె.శంకర్ గౌడ్ (సీఐటీయూ)లు డిమాండ్ చేశారు. సిఐ కార్మికులపై దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేశామని, వారిని అరెస్టు కూడా చేశామని చట్టపరంగా దోషులపై చర్యలు తీసుకుంటామని, మున్సిపల్ కార్మికులకు రక్షణ కల్పిస్తామని హామీనిచ్చారు. దాంతో మున్సిపల్ కార్మికులు ధర్నా విరమించారు. కార్యక్రమంలో జవాన్లు గోపి, గాబ్రియల్, ఎం.గంగారాం, బి.రాజు, కార్మికులు గంగామణి, సాయమ్మ, పోశెట్టి, అబ్బయ్య, జి.సాయిలు, కృష్ణ, సంతోష్, శివకుమార్, డ్రైవర్లు అశోక్, లేబర్లు పాల్గొన్నారు.



ఆందోళనలో పాల్గొన్న సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ నాయకులు

ఖంబాపూర్‌లో 3 డెంగ్యూ కేసులు

నవతెలంగాణ-పిట్లం

మండలంలోని ఖంబాపూర్ గ్రామంలో 3 డెంగ్యూ కేసులు నమోదవడంతో రెండు రోజులుగా కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో సర్వే, క్యాంపును నిర్వహించినట్టు హెల్త్ వర్గాలు వెల్లడించాయి. ఈ సందర్భంగా గ్రామంలో మొదటిరోజు ఇంటింటి సర్వే నిర్వహించారు. రెండో రోజైన గురువారం గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించి డోర్ టు డోర్ డెంగ్యూ, చికెన్ గున్యా, విష జ్వరాలపై పరీక్షలు నిర్వహించి రోగగ్రస్తులకు మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ పూజ, భూమయ్య, ఇన్చార్జి ఏఎన్ఎం ముజాహిదా, ఆశావర్కర్లు నాగమణి, సునీత, బాలమణి, పంచాయతీ సెక్రటరీ అంబయ్య, పాల్గొన్నారు.

వర్షం కోసం పూజలు

నవతెలంగాణ-నిజాంసాగర్

మండలంలోని మల్లూర్ గ్రామంలో వర్షం కోసం గ్రామస్తులు చెరువు నీటితో గుడిలో గురువారం అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. ఈ సంవత్సరం వర్షాలు తక్కువగా పడటం వలన తడి బట్టలతో చెరువు నీటిని తీసుకొచ్చి గ్రామంలో ఉన్నటువంటి ఆంజనేయ స్వామి ఆలయంలో శివునికి అభిషేకం చేశామని వారు తెలిపారు. కార్యక్రమంలో ఒంటరి విట్టల్ రెడ్డి, పెద్ది హన్మండ్లు, పెద్ది అంజయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



జలాభిషేకం చేయడానికి వెళ్తున్న గ్రామస్తులు

సాలూర పీహెచ్‌సీ ఇంచార్జి వైద్యులుగా ఉమా

నవతెలంగాణ-బోధన్


సాలూర మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్‌గా డా.ఉమా గురువారం ఇంచార్జి వైద్యురాలిగా బాధ్యతలు చేపట్టారు. డా.ఉమా వర్ని పీహెచ్‌సీ ఆయుష్ వైద్యురాలిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆమెను వర్ని నుంచి సాలూర పీహెచ్‌సీ ఇంచార్జి వైద్యురాలిగా నియమించారు. వారంలో 3 రోజులు అనగా సోమ, మంగళ, బుధవారం రోజులలో ఆమె సాలూర పీహెచ్‌సీలో రోగులకు వైద్య సేవలందించనున్నారు.



అవినీతి తహసీల్దార్ సస్పెండ్

నవతెలంగాణ-నాగిరెడ్డిపెట్

తహసీల్దార్ కార్యాలయంలో పైసలిస్తేనే పనిచేస్తున్నారని నాగిరెడ్డిపేట్ ధర్మరెడ్డి గ్రామానికి చెందిన పలువురు రైతులు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఈ విషయంపై పలు పత్రికలలో పైసలిస్తేనే తహసీల్దార్ కార్యాలయంలో పని జరుగుతుందని కథనాలు రావడంతో ఈ విషయంపై ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్‌రావు కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సాంగ్వన్‌తో మాట్లాడగా.. కలెక్టర్ విచారణ చేపట్టాలని ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నే ప్రభాకర్‌ను ఆదేశించారు. దీంతో ఎల్లారెడ్డి ఆర్‌డిఓ మన్నే ప్రభాకర్ నాగిరెడ్డిపేట్ తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని తహసీల్దార్ లక్ష్మణ్‌పై అవినీతి ఆరోపణలు చేసిన రైతులను విచారణ చేపట్టారు. నివేదికలను జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. తహసీల్దార్ లక్ష్మణ్‌పై వచ్చిన అవినీతి ఆరోపణలు నిజం కావడంతో జిల్లా కలెక్టర్ నాగిరెడ్డిపేట్ తహసీల్దార్ లక్ష్మణ్‌ను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.




తహసీల్దార్ లక్ష్మణ్

ఎమ్మెల్యే చొరవతో తహసీల్దార్ సస్పెండ్..

ఎల్లారెడ్డి నియోజకవర్గాన్ని అవినీతి రహిత నియోజకవర్గంగా తీర్చిదిద్దాలనే ఆలోచనలో ఉన్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్‌రావు దృష్టిలో నాగిరెడ్డిపేట్ తహసీల్దార్ లక్ష్మణ్ డబ్బులు ఇస్తేనే పనిచేస్తున్నారని కొందరు రైతులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేయడంతో తహసీల్దార్‌పై విచారణ జరిపి సస్పెండ్ చేయాల్సిందిగా కామారెడ్డి కలెక్టర్‌ను ఆదేశించినట్లు కాంగ్రెస్ నాయకులు గురువారం పేర్కొన్నారు.

రెండో విడత నిజాంసాగర్ నీటి విడుదల



నిజాంసాగర్ ప్రాజెక్టు

నవతెలంగాణ-నిజాంసాగర్

మండల కేంద్రంలోని నిజాంసాగర్ ప్రాజెక్టు ప్రధాన కాలువ నుండి 1000 క్యూసెక్కుల చొప్పున ఖరీఫ్ పంట సాగు నీటి కోసం రెండో విడత నీటిని పది రోజులపాటు గురువారం 12 గంటల నుంచి విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్ట్ ఏఈఈ శివ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం17.802 టీఎంసీలకు గాను ప్రస్తుతం ప్రాజెక్టులో 4.875 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టులు నీరు తక్కువగా ఉండడం వలన రైతులందరూ కూడా నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని ఆయన కోరారు. తూములు ఎక్కడపడితే అక్కడ తెరవకూడదని ఆయన అన్నారు. నిబంధనలను కాదని అక్రమంగా ఎవరైనా తూములు తెరిస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

జూనియర్ కళాశాలను
సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం

నవతెలంగాణ-నిజాంసాగర్

మండల కేంద్రంలో గత సంవత్సరంలో నూతనంగా మంజూరైన ప్రభుత్వ జూనియర్ కాలేజ్‌ను మండలంలోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం అన్నారు. గురువారం మండలంలోని వడ్డేపల్లి గ్రామంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2024-2025 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల కొరకు ఈనెల 31 వరకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన అన్నారు. ఇంటర్మీడియట్ కోర్సులలో ఎంపీసీ, బైపిసి, సీఈసీ, హెచ్ఇసి కోర్సులలో ఖాళీలు ఉన్నాయని పదవ తరగతి పూర్తయిన విద్యార్థులు కాలేజీలో చేరాలని ఆయన కోరారు. అడ్మిషన్ ఫీజు, టెక్స్ బుక్స్ ఉచితంగా ఇస్తామని ఆయన అన్నారు. వేరే గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులకు బస్‌పాస్ సౌకర్యం కూడా ఉంటుందని అలాగే స్కాలర్షిప్ సౌకర్యం కూడా ఉంటుందని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్క విద్యార్థి ఉపయోగించుకోవాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అసద్ ఫరూక్, కళాశాల సిబ్బంది సాయిరాం, రమేష్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం

పెండింగ్ డిఏలను వెంటనే విడుదల చేయాలి

నవతెలంగాణ-కంఠేశ్వర్


మాట్లాడుతున్న భోజారావు

రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన నాలుగు డిఏలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ నిజామాబాద్ జిల్లా కార్యవర్గం డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం జిల్లా అధ్యక్షులు కే.రామ్మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు భోజారావు మాట్లాడుతూ.. ఇప్పటివరకు నాలుగు డిఏలు రెండు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నాయని, దీని మూలంగా రిటైర్డ్ ఉద్యోగులు ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన అన్నారు. అదేవిధంగా పిఆర్సి కమిటీని వెంటనే రిపోర్టు విడుదల చేసేలా 30శాతంతో ఫిట్మెంట్ చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మదన్మోహన్ జిల్లా కోశాధికారి ఈ.విల్. నారాయణ, ఉపాధ్యక్షులు లావు వీరయ్య జిల్లా నాయకులు వెంకట్రావు, శిర్ప హనుమాన్లు, దీన సుజన, ప్రసాద్ రావు, రాధాకృష్ణ, సిర్ప లింగం, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైకి సన్మానం

నవతెలంగాణ-మోర్తాడ్


ఎస్సైని సన్మానిస్తున్న పలువురు

ఇటీవల నూతనంగా బదిలీపై వచ్చిన మోర్తాడ్ ఎస్ఐ భూపెళ విక్రమ్‌కి స్థానిక గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు సన్మానించారు. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు తమ వంతు సహాయ సహకారాలు పోలీసులకు ఎల్లవేళలా అందిస్తామని గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు జక్కం అశోక్ అన్నారు. గ్రామ సమస్యల పరిష్కారానికి పోలీసులకు గ్రామస్తుల తరఫున తాము ఎప్పుడు అందుబాటులో ఉంటామని, సమస్యల పరిష్కారానికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు రాజేందర్ పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

నవతెలంగాణ-ముప్కాల్


రమేష్ (ఫైల్)

మండలంలోని వేంపల్లి గ్రామానికి చెందిన దండగుల రమేష్ జులై 27 రాత్రి 08:30 సమయంలో ఆర్మూర్‌లో పని ఉందని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లాడు. ఇప్పటివరకు తిరిగి రానందున రమేష్ భార్య దండగుల సుమలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్ఐ రజినీకాంత్ తెలిపారు. రమేష్ ఆచూకీ తెలిసినవారు ముప్కాల్ పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

పాడి గేదెలు, నాటుకోళ్ళ పెంపకంపై దృష్టి సారించాలి

- ఏపీఎం సువర్ణ

నవతెలంగాణ-డిచ్‌పల్లి


మాట్లాడుతున్న ఏపీఎం

మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా గురువారం ఇందల్ వాయి మండల కేంద్రంలోని ఇందిరాక్రాంతి పథం కార్యాలయంలో మండలం లోని అన్ని గ్రామాలకు చెందిన గ్రామ సంఘాల అధ్యక్షులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఏపీఎం సువర్ణ మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో గ్రామ సంఘాల ఆధ్వర్యంలో బ్యాంక్ లింకెజి రుణాలు, స్త్రీ నిధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. "మహిళ శక్తి" కార్యక్రమంలో భాగంగా పాడి గేదెలు, నాటుకోళ్ళ పెంపకం,న్యూ ఇంటర్ ప్రైజెస్‌తో పాటు అనేక కార్యక్రమాలను సంఘాల సభ్యులు వినియోగించుకోవాలని అన్నారు. ఏదైనా అవసరముంటే కార్యాలయంలో సంప్రదించి మరిన్ని విషయాలను తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వం నుండి బ్యాంకుల ద్వారా లభించే వాటిపై వారికి అవగాహన కల్పించారు. సమావేశంలో మండల మహిళా సమాఖ్య సభ్యులు, మండలంలోని 24 గ్రామాలకు చెందిన అధ్యక్షులు, సీసీలు ఉదయ్ కుమార్, గోవింద్, అనురాధ, కంప్యూటర్ ఆపరేటర్ రాజు పాల్గొన్నారు.

తెలుగు వ్యవహారిక భాషా దినోత్సవం


ఏర్గట్ల : విద్యార్థులకు బహుమతులు అందజేసిన పలువురు

నవతెలంగాణ-కంఠేశ్వర్/ఏర్గట్ల

నగరంలోని సరస్వతీనగర్ రోడ్ నెంబర్ 4లో శబ్ద తరంగిణి సంస్థ కార్యాలయంలో తెలుగు వ్యవహారిక భాషా దినోత్సవం ఘనంగా గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బ్యాంక్ మేనేజర్ సాయిప్రసాద్ హాజరై తెలుగు భాష అమ్మ భాష అని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి సర్ల ధ్యానం అధ్యక్షత వహించారు. తెలుగు యొక్క గొప్పతనాన్ని వివరిస్తూ ప్రతి ఒక్కరూ మాతృభాషను గౌరవించాలన్నారు. దేశభాషలందు తెలుగు లెస్స అని సూచించారు. కార్యక్రమంలో గడ్డం ప్రకాష్‌గౌడ్, దయానంద్, సాయిప్రసాద్, సందీప్ రెడ్డి, రాజ్ కుమార్, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్ల : ఏర్గట్ల,తడపాకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులు తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, పద్యాలు, తెలుగులో మాట్లాడుకుందాం అనే వివిధ పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు పండితులు ప్రవీణ్ శర్మ, తాడూరి గంగాధర్, ప్రధానోపాధ్యాయులు కృష్ణాచారి, జావీద్, ఉపాధ్యాయులు ప్రసాద్, పవన్, రాజ నర్సయ్య రాజేందర్, శ్రీనివాస్, సమత, ఇందిరా, కృష్ణప్రసాద్, ఆనంద్, దేవానంద్, విజయ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ఏకకాలంలో రుణమాఫీ చేయాలి : సీపీఐ(ఎం)

- తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా

నవతెలంగాణ-ఆర్మూర్



ఆర్మూర్: ధర్నా చేస్తున్న నాయకులు



మాక్లూర్: వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

రైతు రుణమాఫీ చేయాలనీ కోరుతూ సిపిఐ(ఎం) డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు గురువారం ధర్నా నిర్వహించి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ డివిజన్ కార్యదర్శి కార్యదర్శి పల్లపు వెంకటేష్, పట్టణ కార్యదర్శి కూతాడి ఎల్లయ్య మాట్లాడుతూ.. రైతులకు వ్యవసాయ రుణాలు మంజూరు చేసేటప్పుడు లేని నిబంధనలు రుణమాఫీలో విధించడంవల్ల 50శాతం రైతులకు రుణమాఫీ పొందలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎలాంటి షరతులు లేకుండా బ్యాంకు అప్పు ఉన్న ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలన్నారు. షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని, రేషన్ కార్డు నిబంధనలు తొలగించి, పహణి నకల మీద రుణం తీసుకున్న రైతులకు రుణమాఫీ వర్తింపజేయాలని, రెండు లక్షల రూపాయలు పైన అప్పు ఉన్న దానితో సంబంధం లేకుండా ప్రభుత్వం రెండు లక్షల రూపాయలు రైతు ఎకౌంటుకు జమ చేయాలని కోరారు.

రైతు రుణమాఫీ కాక బ్యాంకులో సొసైటీలు వ్యవసాయ శాఖ అధికారుల చుట్టూ తిరుగుతున్నారని అన్నారు. అసైన్డ్ భూములకు కూడా రైతు రుణమాఫీ, రైతుబంధు 7,500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు రుణమాఫీ అయిన రైతులందరికీ కొత్తగా మళ్లీ రుణాలు మంజూరు చేసే విధంగా బ్యాంకులకు, సొసైటీలకు సూచనలు చేయాలని తెలిపారు.

షరతులు లేకుండా రైతులందరికీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులను కూడా ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇచ్చి రైతుబంధు రుణమాఫీ సౌకర్యం కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో పార్టీ ఆర్మూర్ ఏరియా కమిటీ సభ్యులు తొగటి భూమన్న, అమీర్ ఖాన్, ఓంకార్, నవీదు, కిషన్, గణేష్, ఎస్కే రఫిక్, పోసాని, జయ, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

మాక్లూర్ : రైతులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రుణమాఫి ఏక కాలంలో మాఫీ చేయాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కొండ గంగాధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం తహశీల్దార్ శేఖర్‌కు ఏక కాలంలో రుణ మాఫీ చేయాలని వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాల్లో ముఖ్యమైనది రూ.రెండు లక్షల రుణమాఫీ ఏక కాలంలో అందరికీ ఇస్తానని చెప్పి ప్రస్తుతం అనేక ఆంక్షలు విధిస్తూ బ్యాంకుల చుట్టూ రైతులను తిప్పుకోవడం జరుగుతుందన్నారు. 31 లక్షల కోట్లు నిధులు అవసరం ఉండగా రాష్ట్ర ప్రభుత్వం 18 వేల కోట్లు మాత్రమే విడుదల చేసి చేతులు దులుపుకునే ప్రయత్నం జరుగుతుందని తెలిపారు. కాబట్టి రైతులందరికీ ఎటువంటి ఆంక్షలు లేకుండా రూ. 2 లక్షల లోపు ఉన్న రైతులందరికీ ఏకకాలంలో రుణమాఫీ చేయాలని, అదేవిధంగా ప్రతి రైతు ఖాతాలో పంట సాయం కొరకు 15వేల రూపాయలు జమ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ద్యారంగుల శీను, రేపని సుదర్శన్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ధ్యాన్‌చంద్ జయంతి

నవతెలంగాణ-ఆర్మూర్


మెండోరాలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్లో క్రీడలను ప్రారంభిస్తున్న పీడీ

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆలూరు మండల కేంద్రంలో హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించినారు. హాకీ క్రీడల్లో 8 స్వర్ణ పథకాలు సాధించి పెట్టారని పాఠశాల ఇన్చార్జి హెడ్మాస్టర్ జి.రాజేష్ అన్నారు. దేశం మొత్తం గర్వించదగ్గ క్రీడాకారులని ఆయనను ఆదర్శంగా తీసుకొని విద్యార్థిని, విద్యార్థులు వివిధ క్రీడల్లో పాల్గొని దేశానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని పిడి రాజేష్ అన్నాడు. మన దేశంలో క్రీడాకారులకు ప్రభుత్వం ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శౌరిరెడ్డి, గణేష్, శ్రీకాంత్, పిఆర్‌టియు అధ్యక్షులు ఎండి అశ్వక్ హైమద్, హనుమాన్లు, రాం ప్రభువు, చిత్ర, సుమలత, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిజామాబాద్ : మెండోర మండల కేంద్రంలోని శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టులోగల లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో గురువారం క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఫిజికల్ డైరెక్టర్ రాజ్‌కుమార్ సుప్రసిద్ధ భారతీయ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాలలువేసి క్రీడాజ్యోతిని వెలిగించి క్రీడలను ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ.. మనం సుప్రసిద్ధ హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతిని జాతీయ క్రీడా దినోత్సవంగా నిర్వహించుకుంటున్నామని అన్నారు. పిల్లలకు క్రీడలు మానసిక ఉల్లాసంతోపాటు మంచి ఆలోచనలను కలిగిస్తాయని అన్నారు. మానసిక వికాసానికి విద్యతోపాటు క్రీడలు అత్యంత ప్రధానమని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ శివరాం ప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్ నరేందర్, వ్యాయామ ఉపాధ్యాయురాలు ప్రణీత, పాఠశాల ఉపాధ్యాయ బందం, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రపతి అవార్డు గ్రహీత మృతి

నవతెలంగాణ-ఆర్మూర్



రాష్ట్రపతి అవార్డు గ్రహీత, రిటైర్డ్ హెడ్మాస్టర్, హౌజింగ్ బోర్డ్ పద్మశాలి సంఘం మాజీ అధ్యక్షులు శ్రీ ఈరవత్రి రాందాస్ గురువారం మృతి చెందారు. వారి స్వగృహం నుండి అంత్యక్రియలు నిర్వహించగా పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

ఖోఖో క్రీడా దుస్తులు పంపిణీ


క్రీడాకారులకు క్రీడాదుస్తులు అందజేస్తున్న పలువురు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి/భీంగల్ రూరల్

జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని సోషల్ వెల్ఫేర్ విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేసినట్లు మండలంలోని అర్గుల్ గ్రామానికి చెందిన గుమ్మర్ల నరసయ్య గురువారం తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు, తదితరులు ఉన్నారు.

భీంగల్ రూరల్ : ప్రముఖ హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని భీంగల్ పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాలలోని విద్యార్థులకు వివిధ క్రీడలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ షఫీ క్రీడా మాంత్రికుడు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి, తెలుగు పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తూ వారి సేవలను గుర్తించుకున్నారు. క్రీడారంగంలో ధ్యాన్‌చంద్ ప్రతిభను గురించి వివరిస్తూ తెలుగు భాష వ్యావహారిక విధానం కోసం పోరాడిన గిడుగు రామమూర్తి విశేష కషిని గురించి విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సన, ప్రిన్సిపల్ రాధాకష్ణన్ నాయర్, ప్రైమరీ ఇంచార్జ్ చిన్ను, పీటీలు ప్రశాంత్, మనోజ్ఞ, పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

యూనివర్సిటీ పరిపాలన భవనం ఎదుట ధర్నా

- రిజిస్ట్రార్‌కు వినతి

నవతెలంగాణ-డిచ్‌పల్లి


వినతిపత్రాన్ని అందజేస్తున్న పలువురు

అఖిలభారత విశ్వవిద్యాలయల బోధనేతర సిబ్బంది సమైక్య పిలుపుమేరకు తెలంగాణ యూనివర్సిటీలో గురువారం తమ డిమాండ్ల సాధనకు డిమాండ్స్‌డేను నిర్వహించారు. తెలంగాణ యూనివర్సిటీలోని పరిపాలన భవనం ముందు జరిగిన ధర్నాలో యూనివర్సిటీ బోధనేతర సిబ్బంది పాల్గొని తమ నిరసనను, ఆవేదనను వ్యక్తం చేశారు. ప్రధానంగా తమ డిమాండ్లు కంట్రీబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ అమలు చేయాలని, పాలక మండలిలో బోధనేతర సిబ్బందికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. పెండింగ్లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చెయ్యాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రస్తుతం అపరిష్కృతంగా ఉన్న సమస్యలను తీర్చాలని, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఈ హెచ్ ఎస్‌ను అమలుపరచాలని డిమాండ్ చేశారు. అనంతరం తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.యాదగిరికి తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బోధనేతర సిబ్బంది అధ్యక్షులు బి.సాయగౌడ్, ప్రధాన కార్యదర్శి భాస్కర్, ఉపాధ్యక్షురాలు జి-విజయలక్ష్మి, జాయింట్ సెక్రెటరీ బి.వినోద్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉమారాణి, కోశాధికారి జ్యోతి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

మానసిక వికాసానికి క్రీడలు అవసరం

- రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీ ప్రారంభించడం శుభపరిణామం
- రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ యాదగిరి

నవతెలంగాణ-డిచ్‌పల్లి/ఆర్మూర్


డిచ్‌పల్లి: మాట్లాడుతున్న స్పోర్ట్స్ డైరెక్టర్ డాక్టర్ బాలకిషన్


ఆర్మూర్‌లో...

సుప్రసిద్ధ భారతీయ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ స్పోర్ట్ దినాన్ని గురువారం తెలంగాణ యూనివర్సిటీ స్పోర్ట్స్ డైరెక్టర్ డాక్టర్ బాలకిషన్ ఆధ్వర్యంలో ధ్యాన్‌చంద్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.యాదగిరి పాల్గొని మాట్లాడారు. క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు మంచి ఆలోచనలకు భూమిక పోషిస్తాయన్నారు. మానసిక వికాసానికి విద్యతో పాటు క్రీడలు అత్యంత ప్రధానమని తెలిపారు. భారతదేశంలో సైనికుడిగా కొనసాగిన ధ్యాన్ చంద్ అంతర్జాతీయంగా హాకీ క్రీడకు గుర్తింపు తేవడం దేశానికే గర్వకారణమన్నారు. హాకీలో అనేక మంది యువ క్రీడాకారులను ప్రోత్సహిస్తూ అంతర్జాతీయ స్థాయిలో స్వర్ణ పథకాలు కైవసం చేసుకోవడానికి స్ఫూర్తినిచ్చినారని పేర్కొన్నారు. దేశంలో క్రీడలకు మరింత గుర్తింపు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కషి చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహించడం కోసం త్వరలో స్కిల్ యూనివర్సిటీని ప్రారంభించడం శుభపరిణామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అతిథిగా హాజరైన కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డాక్టర్ సిహెచ్ ఆరతి మాట్లాడుతూ.. తెలంగాణ యూనివర్సిటీ క్రీడలకు మరింత ప్రాధాన్యత నివ్వాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇటీవల జరిగిన ఇంటర్ స్టేట్ యూనివర్సిటీలో ప్రతిభ కనపరిచిన క్రీడాకారులకు సర్టిఫికెట్‌లను అందజేసి రిజిస్ట్రార్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఛీఫ్- వార్డెన్ డాక్టర్ మహేందర్ రెడ్డి, డైరెక్టర్ పిఆర్‌ఓ డాక్టర్. ఏ.పున్నయ్య, డాక్టర్ నేత, నరేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలుర ఉన్నత పాఠశాలలో హాకీ టోర్నమెంట్

ఆర్మూర్ : హాకీ జిల్లా అధ్యక్షులు విశాఖ గంగారెడ్డి ప్రధాన కార్యదర్శి సదమస్తుల రమణ ఆధ్వర్యంలో బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మేజర్ ధ్యాన్‌చంద్ 118వ జయంతి సందర్భంగా జాతీయ క్రీడ దినోత్సవాన్ని పురస్కరించుకొని పురుషులు మహిళల హాకీ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాకీ సంఘం ఉపాధ్యక్షులు జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు విద్యాసాగర్ రెడ్డి, అతిథులుగా రిటైర్డ్ హాకీ కోచ్ హర్షవర్ధన్ రెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షులు చెరుకు పథ్వీరాజ్, మాజీ అధ్యక్షులు అంబాల తిరుపతి, బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వనజ అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో హాకీకి ఆర్మూర్ పుట్టినిల్లని, కీర్తిశేషులు హాకీ సంఘం ప్రధాన కార్యదర్శి హనుమంతు, రిటైర్డ్ హాకీ కోచ్ హర్షవర్ధన్ రెడ్డి హాకీ క్రీడకు పునాదులు వేసి జిల్లా క్రీడాకారులను జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా వారిని తీర్చిదిద్దారని అన్నారు. నిజామాబాద్ జిల్లా హాకీ సంఘం అధ్యక్షులు శ్రీ విశాఖ గంగారెడ్డి కూడా హాకీ సంఘ కార్యకలాపాలు నిర్వహిస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. రిటైర్డ్ కోచ్ హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ హాకీ క్రీడను ఆర్మూర్‌లో మరింత ప్రోత్సహిస్తూ లయన్స్ క్లబ్ లాంటి స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి క్రీడాకారులకు చేయూత అందజేయాలని కోరారు. బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వనజ మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన బాలికలను హాకీలో ప్రోత్సహిస్తున్నామని, దానికి నిజామాబాద్ హాకీ సంఘం సహాయ సహకారాలు అవసరం అని తెలియజేశారు. తాము హాకీ క్రీడలో పాల్గొనడంతో స్పోర్ట్స్ కోటలో ఉద్యోగాలు వచ్చాయని తెలిపారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు చెరుకు పథ్వీరాజ్, మాజీ అధ్యక్షులు అంబల్ల తిరుపతి ఆధ్వర్యంలో హాకీ మహిళ క్రీడాకారులను జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకొని హర్షవర్ధన్ రెడ్డి ఘనంగా సన్మానించారు. తర్వాత వెటరన్స్ హాకీ క్రీడాకారుల మధ్య పోటీ నిర్వహించారు. జిల్లా హాకీ సంఘం కోశాధికారి పింజా సురేందర్ ఆధ్వర్యంలో ఇట్టి టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్ నిర్వహణకు సహకరించిన బాయ్స్ హైస్కూల్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీ నర్సయ్య ఫిజికల్ డైరెక్టర్ మల్లేష్ గౌడ్ హాకీ సంఘం తరఫున క్రీడాకారుల తరఫున ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ వెటర్న్ గోల్ కీపర్ రవీందర్, ఆర్గనైజ్ సెక్రెటరీ అంజు, జాయింట్ సెక్రెటరీ చిన్నయ్య ఈసీ మెంబర్స్ సంతోష్ ఠాగూర్, నాగేష్ ,సుధీర్,కత్తి శీను, ఫిజికల్ డైరెక్టర్ బట్టు రాజేశ్వర్, గట్టడి రాజేష్, సీనియర్ క్రీడాకారులు , పరంజ్యోతి,సాయి తేజ శశివర్ధన్, వెటర్న్ హాకీ మహిళా క్రీడాకారిణిలు ఇందిరా, వర్షా టాకూర్, విజయ, సుజాత, భారతి, రాణి, కవిత తదితరులు పాల్గొన్నారు.

పదిలో ఏ గ్రేడ్ సాధించిన విద్యార్థికి నగదు అందజేత

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండల కేంద్రంలో గల జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో 2023-24 సంవత్సరంలో పదవ తరగతిలో ఏ గ్రేడ్ సాధించిన విద్యార్థి ఉదయ్ కిరణ్‌కి గొర్తి ఈశ్వర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పదివేల రూపాయలు నగదు అందజేసినట్టు ఉపాధ్యాయులు అరవింద్ తెలిపారు. గత 25 సంవత్సరాల క్రితం జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో సామాన్య శాస్త్ర ఉపాధ్యాయురాలుగా పనిచేసిన ఉషాబాల మేడం స్ఫూర్తిలో భాగంగా పాఠశాలకు గత 15 సంవత్సరాల నుండి పదవ తరగతిలో మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థికి ప్రతి ఏటా పదివేల రూపాయలు నగదు అందజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు తిరుపతిరెడ్డి, నాజర్, రాజశేఖర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట్ రెడ్డి ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థికి చెక్కును అందజేస్తున్న దృశ్యం

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

నవతెలంగాణ-రామారెడ్డి

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లంపేట గ్రామానికి చెందిన భూక్య శంకర్ (35)కు అన్నారం తండాకు చెందిన బుజ్జితో వివాహమైంది. కొద్ది రోజుల నుంచి భార్యభర్తలు గొడవ పడడం, భార్య తల్లిగారి ఇంటికి రావడంతో బుధవారం శంకర్ భార్య వద్దకు వచ్చి, అక్కడి నుండి అడవికి వెళ్లి కట్టెలు కొట్టుకొచ్చి, అన్నారం శివారులో కల్వర్టు ప్రక్కన అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మృతుడి అన్న భూక్య రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.


శంకర్ మృతదేహం

జాతీయ క్రీడా దినోత్సవం

- ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా చిత్రపటానికి నివాళి

నవతెలంగాణ-విలేకరుల బృందం

నిజాంసాగర్ : మండల కేంద్రంలోని జవహర్‌లాల్ నవోదయ విద్యాలయంలో ప్రిన్సిపాల్ సత్యవతి ధ్యాన్‌చంద్ చిత్రానికి పూలమాలవేసి ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ధ్యాన్‌చంద్ భారత హాకీకి ఎనలేని సేవ చేయడమే కాకుండా ఒలంపిక్స్‌లో ఆరు బంగారు పథకాలను గెలుపొందారని ఆమె అన్నారు. అనంతరం పాఠశాలలో బాలికలు ఏరోబిక్స్ అంశంపై ప్రదర్శన ఇచ్చారని ఆమె తెలిపారు. సాయంత్రం టైంలో విద్యార్థులకు టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్, కబడ్డీ, కొక్కో, వాలీబాల్ పోటీలను నిర్వహించినట్టు వాటిలో ప్రతిభ కనబరిచిన వారికి అభినందించడం జరిగిందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్, పీఈటి తదితరులు పాల్గొన్నారు.


నిజాంసాగర్ : క్రీడా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు


భిక్కనూర్ : 1కే రన్‌లో పాల్గొన్న విద్యార్థులు

జాతీయ క్రీడా దినోత్సవం

సదాశివనగర్ : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల కామారెడ్డి మర్కల్‌లో జాతీయ క్రీడా దినోత్సవాన్ని, తెలుగు భాషా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.శోభరాణి అధ్యక్షత వహించి మాట్లాడుతూ.. క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయని, గెలుపోటములను రెండింటినీ సమానంగా స్వీకరించే స్ఫూర్తి విద్యార్థుల్లో క్రీడల వల్లనే సాధ్యమవుతుందని చెప్పారు. వ్యవహారిక తెలుగుభాష ప్రాధాన్యాన్ని, గిడుగు రామ్మూర్తి పంతులు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.శ్రావణి, తెలుగు విభాగాధిపతి ఆర్.ఉదయని, ఫిజికల్ డైరెక్టర్ కె.రమాదేవి, కల్చరల్ కోఆర్డినేటర్ పి.సింధూర తదితరులు పాల్గొన్నారు.

రెంజల్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని క్రీడా పోటీలను నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు పేర్కొన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్ క్రీడలను నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేయడమే కాకుండా వారికి స్వీట్లు పంపిణీ చేసినట్టు తెలిపారు. అంతకుముందు మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.ఆంజనేయులు, పిఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శి కిషోర్, వ్యాయామ ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాభారతి ఆధ్వర్యంలో క్రీడా దినోత్సవం..

కామారెడ్డి : హాకీ మాంత్రికుడు మేజర్ ద్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం కామారెడ్డిలో క్రీడాభారతి ఆధ్వర్యంలో శ్రీ సరస్వతి శిశుమందిర్ విద్యాలయంలో కామారెడ్డి పట్టణంలోని బాల బాలికలకు క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్ఎస్ఎస్ ఇందూర్ విభాగ్ ప్రచారక్ శివకుమార్ హాజరయ్యారు. విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఆటగాడు ఒక సైనికుడిలా నిరంతరం సాధన చేస్తూ ఉండాలని, విద్యార్థులకు శారీరక శ్రమతో పాటు మానసిక ఆరోగ్యం ముఖ్యమేనన్నారు. అలాగే మరో విశిష్ట అతిథి చెస్ బాక్సింగ్ అంతర్జాతీయ క్రీడాకారిణి కుమారి తక్కడపల్లి ప్రతిభ హాజరై మాట్లాడుతూ.. క్రీడారంగంలో విద్యార్థులందరూ పాల్గొని అన్ని రకాల క్రీడలలో రాబోయే రోజుల్లో మన దేశ పతాకాన్ని రెపరెపలాడించాలని, ఆమె ఎదిగిన విధానాన్ని, కష్టపడిన విధానాన్ని విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 20 పాఠశాలల నుండి సుమారు 700 మంది విద్యార్థులు పాల్గొనగా అండర్ - 14లో ఖోఖో, అండర్-17 వాలీబాల్ క్రీడలను నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో క్రీడాభారతి కామారెడ్డి జిల్లా అధ్యక్షులు కొమిరెడ్డి మారుతి, సెక్రటరీ శ్రీనివాస్, సాయినాథ్, మహిపాల్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల 1కే రన్

భిక్కనూర్ : పట్టణ కేంద్రంలోని విజ్ఞాన్ హైస్కూల్ విద్యార్థులు పాఠశాల కరస్పాండెంట్ విజయ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారతదేశ ప్రముఖ హాకీ క్రీడాకారులు ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా పట్టణ కేంద్రంలో పోలీస్ స్టేషన్ నుంచి చౌరస్తా వరకు 1కే రన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్సై సాయికుమార్ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి చదువుతోపాటు క్రీడారంగంలో రాణించాలని సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు సన్మానం

లింగంపేట్ : జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని క్రీడాకారులకు పూర్వ విద్యార్థులు శాలువా కప్పి సన్మానించారు. గురువారం జాతీయ క్రీడా దినోత్సవం మేజర్ ద్యాన్‌చంద్ జయంతి సందర్భంగా క్రీడాలకు సేవ చేసిన గురువు, ఉపాధ్యాయులు సిద్ధికి అలాగే పిడి రాజాగౌడ్‌ను పూర్వ విద్యార్థులు బాలుర ఉన్నత పాఠశాలలో ఘనంగా సన్మానించారు. క్రీడారంగంలో వారు చేసిన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మెహ్రాజ్, భానుచందర్ గౌడ్, శేఖర్, ముజామిల్, తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వృద్ధుని మృతదేహం లభ్యం

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని జానకంపేట్ గ్రామంలో గుర్తు తెలియని ఓవృద్ధుడి(75) మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు. స్థానిక గ్రామస్తుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకొని శవ పంచనామా నిర్వహించారు. వృద్ధుని మృతదేహాన్ని బోధన్ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు. వృద్ధుడు తెలిసిన వారు 8712659873, 8712659780 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

స.హ.చట్టం ద్వారా వివరాలు ఇచ్చేందుకు నిరాకరించిన ఆలయ ఈవో

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణ కేంద్రంలోని దక్షిణ కాశి శ్రీ సిద్ధ రామేశ్వర ఆలయ వివరాలు సహ చట్టం ద్వారా దరఖాస్తు చేసుకోగా ఆలయ ఈవో శ్రీధర్ వివరాలు ఇవ్వడానికి నిరాకరించినట్లు సమాచార హక్కు రక్షణ చట్టం జిల్లా ప్రతినిధి గంగల రవీందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సహ చట్టం ద్వారా సమాచార హక్కు చట్టాన్ని ఉపయోగించి శ్రీ సిద్ధమేశ్వర స్వామి దేవస్థానానికి సంబంధించి ఆలయ ప్రాచీన చరిత్ర, పునర్నిర్మాణం, అభివృద్ధి పేరిట చేసిన పనుల వివరాలు, చందాల వివరాలు, రిసిప్ట్‌లు బుక్స్, ఆడిట్ వివరాలు ఇవ్వాలని దరఖాస్తు ద్వారా కోరగా 30 రోజుల్లో ఇవ్వాల్సిన వివరాలు 30 రోజులు దాటిన తర్వాత సమాచారాన్ని ఇవ్వకుండా సమాచార హక్కు చట్టం ద్వారా ఎలాంటి దరఖాస్తులు తాము స్వీకరించం మాకు సమాచారం ఇచ్చే అధికారం అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎండోమెంట్ డిపార్ట్మెంట్‌కు లేదని తెలిపినట్లు తెలిపారు. సర్వసాధారణం సమాచారాన్ని అడుగుతే కోర్టు ద్వారా సమాచారం ఇవ్వకూడదని రాతపూర్వకంగా వాళ్లకు ఏదో కాపీ ఉందని చెపుతూ ఒక లేఖను రాసి సైన్ చేసి స్టాంపుతో దరఖాస్తు ఇచ్చి సమాచార హక్కు చట్టం అనేది ఎండోమెంట్ డిపార్ట్మెంట్ కు సంబంధం లేదని తెలిపారు. ఆలయ ఈవోపై అధికారులు చట్టరీత్యా చర్యలు తీసుకోవడంతో పాటు సమాచార హక్కు చట్టంలోని నిబంధనలు ఉల్లంఘించినందుకు క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సమాచారం ఇవ్వకుండా నిరాకరించినందుకు సహ చట్టం అధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు, కోర్టును ఆశ్రయించనున్నట్టు తెలిపారు.

సోమేశ్వర్ స్టోన్ క్రషర్లతో ఇబ్బందులు

- తొలగించాలని సీఎం, కలెక్టర్లకు ఫిర్యాదు

నవతెలంగాణ-బాన్సువాడ (నసురుల్లాబాద్)

బాన్సువాడ మండలం సోమేశ్వర్ గ్రామానికి ఆనుకొని ఉన్న రెండు స్టోన్ క్రషర్లను తొలగించాలని గ్రామస్తులు సీఎం, కలెక్టర్‌కు పోస్టు ద్వారా ఫిర్యాదు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. సోమేశ్వర గ్రామానికి, నివాసాలకు ఆనుకొని గత 30 ఏళ్లుగా స్టోన్ క్రషర్లు నడుస్తున్నాయని, వీటి బ్లాస్టింగులతో ఇళ్ల బీటలు వారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పేలుళ్ల శబ్దాలు, దుమ్ము, కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, అనారోగ్యాలకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా కలెక్టర్ స్పందించి జన సంచారం ప్రాంతంలో ఉన్న స్టోన్ క్రషర్‌ను వెంటనే తొలగించాలన్నారు. ఎక్కడ జన సంచారం లేని ప్రాంతంలో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ స్టోన్ కర్షర్ వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వారు విన్నవించారు.

రేషన్ కార్డు లేని రైతుల వివరాలు సేకరణ

నవతెలంగాణ-నిజాంసాగర్

రేషన్ కార్డులు లేని కారణంగా రుణమాఫీ కానీ రైతుల కుటుంబ సభ్యుల నిర్ధారణ చేసి రుణమాఫీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీచేసిన నేపథ్యంలో గురువారం మండలంలోని మాగి గ్రామంలో రేషన్ కార్డులు లేని రైతుల ఇళ్లకు వెళ్లి వారి కుటుంబ సభ్యుల వివరాలు సేకరించినట్టు మండల వ్యవసాయ అధికారి అమర్ ప్రసాద్ తెలిపారు. అనంతరం సేకరించిన వివరాలను ఆన్లైన్లో నమోదు చేయనున్నట్టు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి సాగర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గిద్ద జిల్లా పరిషత్ పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవం

నవతెలంగాణ-రామారెడ్డి

గిద్ద జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. ప్రముఖ హాకీ క్రీడాకారుడు ధ్యాన్చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కన్నయ్య మాట్లాడుతూ.. చదువుతోపాటు ఆటలు జీవితంలో ఎంతో ముఖ్యమని, శరీర దృఢత్వాన్ని, ఆరోగ్యంగా ఉండడానికి, మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

నవతెలంగాణ-బిచ్కుంద/లింగంపేట్

తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా బిచ్కుంద మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అటానమస్‌లో తెలుగు విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ మాట్లాడుతూ గిడుగు రామమూర్తి పంతులు తెలుగు భాషకు చేసిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమానాలు ప్రదానం చేశారు. అనంతరం భారత హాకీ క్రీడాకారుడు ధ్యాన్చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు మానసిక ఉల్లాసాన్ని కలిగించడానికి క్రీడలు ఎంతో అవసరమని, కళాశాలలో విశాలమైన క్రీడా ప్రాంగణం క్రీడా పరికరాలు విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

తెలుగు భాషా దినోత్సవం

లింగంపేట్ : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలుగుభాష దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. తెలుగు ఉపన్యాసకులను దుర్గయ్యకు శాలువా కప్పి పూల దండ వేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ నరేందర్ మాట్లాడుతూ.. తెలుగుభాష ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నరేందర్, ఉపాధ్యాయులు శివ అంజయ్య, దర్శన్ రాజయ్య, అంజమ్మ, శ్రీలత, పాల్గొన్నారు.


లింగంపేట్ మండలంలో

అక్రమ కట్టడాలను తొలగించాలి

నవతెలంగాణ-రెంజల్

అక్రమ కట్టడాలను తొలగించాలని రెంజల్ బిజెపి మండల నాయకులు అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ రవికుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. 2017లో 340 సర్వే నెంబర్‌లో అక్రమంగా స్థలాన్ని కబ్జా చేశారని పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదని, చివరికి తాము హైకోర్టును ఆశ్రయించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు గోపికృష్ణ, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు మేక సంతోష్, మాజీ మండల అధ్యక్షులు చుక్క రాజు గౌడ్, ప్రధాన కార్యదర్శి ఈర్ల రాజు, లోలపు వడ్డెన్న, సగ్గు రవి, గాండ్ల నాగరాజ్, శివ, యోగేష్, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

29వ సారి రక్తదానం చేసిన జీవశాస్త్ర ఉపాధ్యాయుడు

నవతెలంగాణ-సదాశివనగర్

కామారెడ్డి జిల్లాలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో డెంగ్యూతో బాధపడుతున్న 22 సంవత్సరాల యువకునికి అత్యవసరంగా ఓ పాజిటివ్ ప్లేట్లెట్స్ అవసరం ఉండగా కామారెడ్డి జిల్లా రక్తదాతల సమూహం సంప్రదించగా సదాశివనగర్ మండలం ధర్మారావుపేట పాఠశాలలో జీవశాస్త్రం బోధిస్తున్న ఉపాధ్యాయుడు కృష్ణకర్ రావు వెంటనే స్పందించి 29వ సారి రక్తదానం చేశాడు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంఇఓ యేసఫ్ కృష్ణకర్‌ను అభినందిస్తూ ప్రతి ఒక్కరు రక్తదానం చేయడానికి ముందుండాలని అన్నారు. రక్తదానం చేసిన కృష్ణకర్‌కు కామారెడ్డి జిల్లా రక్తదాతల ప్రతినిధి శ్రీధర్, శివకుమార్, ఉపాధ్యాయ బృందం నరేందర్, దయానంద్ స్వామి, అన్వర్, చిన్నయ్యలు, పేషెంట్ తరపు బంధువులు కృతజ్ఞతలు తెలియజేశారు.

రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపికైన రెడ్డిపేట విద్యార్థులు


పోటీలకు ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

నవతెలంగాణ-రామారెడ్డి

సెప్టెంబర్ 1 నుండి 3వరకు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో నిర్వహించే ఏడవ సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి పోటీలకు మండలంలోని రెడ్డిపేట జిల్లా పరిషత్ పాఠశాలలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాల్ రెడ్డి, వ్యాయమ ఉపాధ్యాయులు సాయి మౌర్య తెలిపారు. ఉపాధ్యాయులు, గ్రామస్తులు వారిని ప్రత్యేకంగా అభినందించారు. బాలికలు జి రక్షిత, డి సంజన, జి బిందు, ఎల్ వైష్ణవి, బాలురు సిహెచ్ శివ కార్తీక్, ఈ రోహిత్, ఎం రిత్విక్, ఎన్ భరత్ ఎంపికయ్యారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్ ద్వారా ట్రేస్ చేసి గుర్తించి స్వాధీనం చేసుకుని గురువారం బాధితునికి అందించినట్లు ఎల్లారెడ్డి ఎస్ఐ మహేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం ఎల్లారెడ్డి మండలానికి చెందిన బండారి కృష్ణంరాజు తన ఫోన్‌ను జూన్ 16న ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో పోగొట్టుకున్నాడు. నాగిరెడ్డిపేట్ మండలం జానకంపల్లి గ్రామంలో సెల్ఫోన్ ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకుని ఎల్లారెడ్డి పోలీస్‌స్టేషన్లో కృష్ణంరాజుకు అందజేశారు.


బాధితుడికి సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్ఐ

మెనూ ప్రకారం భోజనం అందించాలి

- మండల ప్రత్యేక అధికారి చందర్ నాయక్

నవతెలంగాణ-బిచ్కుంద

హాస్టల్లో పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, పరిసరాలు శుభ్రతతో పాటు విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని జెడ్పి సీఈవో, మండల ప్రత్యేక అధికారి చందర్ నాయక్ అన్నారు. గురువారం బిచ్కుంద మండలంలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ముందుగా పుల్కల్ గ్రామంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహిస్తున్న రక్త నమూనా సేకరణ పరిశీలించారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలకు ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఇంటింటికి తిరిగి జ్వరాల బారిన పడిన వారి రక్త నమూనాలు సేకరించి వైద్య చికిత్సలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. మండల కేంద్రంలోని ఎస్సీ, బీసీ బాలుర హాస్టల్, బీసీ బాలికల హాస్టల్‌ను తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్ పరిశీలించి స్టోర్ రూమ్‌లో నిలువచేసిన స్టాకును పరిశీలించి విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వండి వడ్డించాలని సూచించారు. అంబేద్కర్ చౌరస్తాలో విధులలో నిల్వ ఉన్న నీటిలో సిబ్బందితో ఆయిల్ బాల్స్ వేయించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి ఓటర్ లిస్ట్ జాబితా ఇంటింటికి తిరిగి చేర్పులు మార్పులు త్వరగా పూర్తి చేయాలని గ్రామాల్లో స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించి ఎప్పటికప్పుడు చెత్తాచెదారాన్ని తొలగించాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో గోపాలకృష్ణ, గ్రామ కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్ సిబ్బందికి ఉన్నారు.


రక్త నమూనాల సేకరణ పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి

కుటుంబ కలహాలతో దాడులు

- ఆరుగురికి తీవ్ర గాయాలు.. పరిస్థితి విషమం

నవతెలంగాణ-నసురుల్లాబాద్

కుటుంబ సభ్యుల మధ్య కలహాలతో పరస్పరం ఇరు కుటుంబాలు దాడులు చేసుకోవడంతో పలువురు తీవ్రంగా గాయపడిన ఘటన బీర్కూర్ మండల కేంద్రంలో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. రెండు కుటుంబాల మధ్య మాటమాట పెరిగి ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడంతో తలలు పగిలాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగలి రాము, బాబులాల్ కుటుంబ సభ్యులు రాత్రి రెండు గంటల సమయంలో గొడవకు దిగారు. ఒకరిపై ఒకరు దూషించుకోవడంతో గొడవ తీవ్రమైంది. ఈ క్రమంలో రాడ్లు, ఇటుకలతో కొట్టుకోవడంతో పలువురి తలలు పగిలాయి. స్థానికులు గొడవ సద్దుమణిగేలా ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో గొడవ సద్దుమణిగింది. తీవ్ర రక్తస్రావం కావడంతో క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గతంలో ఇలాగే దాడులు చేసుకోవడంతో ఇదే కుటుంబానికి చెందిన ఓ మహిళ మృతి చెందింది. అదే విషయాన్ని దృష్టిలో పెట్టుకొని కుటుంబ సభ్యులు గొడవపడ్డారని, ఇరువురి మధ్య ఆస్తి తగాదాలే గొడవకు కారణమై ఉండొచ్చని స్థానికులు చెప్పుకొచ్చారు. ఈ విషయంపై పోలీసులు ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు బీర్కూర్ ఎస్సై తెలిపారు.

డ్రగ్స్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- గంజాయి నిర్మూలనపై అవగాహన సదస్సు

నవతెలంగాణ-దోమకొండ

డ్రగ్స్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్సై ప్రభాకర్ అన్నారు. గురువారం బీబీపేట మండలంలోని యాడారం గ్రామంలో ఆధ్వర్యంలో గంజాయి, సారాయి మత్తు పదార్థాల నిషేధంపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై ప్రభాకర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో మత్తు పదార్థాల వలన జరిగే అనార్థాలపైన ప్రజలకు అవగాహనా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో పోలీసులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.



పండగను శాంతియుతంగా జరుపుకోవాలి

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

వినాయక చవితి పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని నాగిరెడ్డిపేట్ ఎస్సై మల్లారెడ్డి పేర్కొన్నారు. వినాయక చవితి పండగను పురస్కరించుకొని మండల కేంద్రంలో గల పోలీస్‌స్టేషన్లో గురువారం ఆయా గ్రామస్తులతో పోలీస్‌స్టేషన్లో సమావేశం ఏర్పాటు చేసి పండగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని అన్నారు. గణపతి పండుగను పురస్కరించుకొని డీజే సౌండ్ ఏర్పాటుకు అనుమతులు లేవని ఆయన పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ కవితను కలిసిన మాజీ జెడ్పిటిసి

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

బెయిల్‌పై బయటకు వచ్చిన ఎమ్మెల్సీ కవితను మాజీ జెడ్పిటిసి ఫోరం ప్రధాన కార్యదర్శి ఉమన్నగారి మనోహర్‌రెడ్డి గురువారం కలిశారు. సుప్రీంకోర్టు తీర్పును ప్రతి ఒక్కరూ గౌరవించాలని ఆయన అన్నారు. కోర్టులో న్యాయం గెలిచిందని కవిత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కూతురు అనే ఉద్దేశంతో కావాల్సి ఆమెను అరెస్టు చేయించారని ఆయన పేర్కొన్నారు.

పాదయాత్రను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-నిజాంసాగర్

ప్రతి సంవత్సరం శ్రావణమాసం ఆఖరి శనివారం చేపట్టే మహా పాదయాత్రను కులమతాలకు, రాజకీయాలకు అతీతంగా అందరు పాల్గొని విజయవంతం చేయాలని మనకోసం మనం ఫౌండేషన్ ఫౌండర్ కిషోర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని బ్రాహ్మణపల్లి గేటు వద్ద ఉన్న అంజనాద్రి క్షేత్రం నుంచి పిట్లం చౌరస్తా, జక్కాపూర్, మల్లూరు, అన్నారం గ్రామాల మీదుగా రామేశ్వరం గుట్ట వరకు పాదయాత్ర ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని పాదయాత్రను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

అక్యుప్రెషర్ మ్యాగ్నెటిక్ హైబ్రేషన్ చికిత్స శిబిరం

- లయన్స్ క్లబ్ జిల్లా ఆర్గనైజర్ కరటూరి సూర్యనారాయణ

నవతెలంగాణ-ఎడపల్లి

మండల కేంద్రంలోని సాయిబాబా మందిరం అన్నదాన ప్రసాద కేంద్రంలో ఈనెల 29 నుంచి సెప్టెంబర్ 4వరకు ఏడు రోజులపాటు అక్యుప్రెషర్ మ్యాగ్నటిక్ హైబ్రేషన్ చికిత్స శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రాం చైర్మన్ వెంకటేశ్వర శర్మ, లయన్స్ క్లబ్ ఆఫ్ జిల్లా ఆర్గనైజర్ సూర్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

బాలుడిపై వీధి కుక్కల దాడి

• తీవ్రగాయాలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగర శివారులోని సారంగాపూర్ డైరీ ఫాం దగ్గర బాలుడిపై వీధి కుక్కల దాడి చేయగా బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు.. నగర శివారులోని సారంగాపూర్ డైరీ ఫారం ప్రాంతంలో ఇంటి బయట ఆడుకుంటున్న షేక్ సుమేర్ అనే బాలుడి పై విచక్షణారహితంగా దాడి చేశాయి. ఈ దాడిలో సుమేర్ తలకు, చెవికి గాయాలయ్యాయి. తీవ్ర రక్తస్రావంతో బాధపడుతున్న బాలుడిని తల్లిదండ్రులు, హుటాహుటిన నిజామాబాద్ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. గతంలో కూడా మరో ఇద్దరు వ్యక్తులు పై కుక్కలు దాడులు చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు.

అమ్మ ఆదర్శ పాఠశాల పనులు పరిశీలన

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

నిజామాబాద్ రూరల్ మండలంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గూపన్‌పల్లిలో కొనసాగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పాఠశాల మరమ్మతుల పనితీరును, మధ్యాహ్న భోజన నిర్వాహణ విధానం, పాఠశాలలో కొనసాగుతున్న అభ్యసన అభివృద్ధి కార్యక్రమ (ఎల్ఐపి) పరీక్ష ఫలితాలను మండల విద్యా శాఖా అధికారి శ్రీ.సేవల గురువారం పర్యవేక్షించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు శకుంతల దేవి, తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు బట్టు. క్రిష్ణరెడ్డి, నిజామాబాద్ రూరల్ మండల పిఆర్‌టియు ప్రధాన కార్యదర్శి అంజయ్య, పాఠశాల ఉపాధ్యాయులు శ్యామల, జయసాగర్, శ్రీరామ్ లక్ష్మణ్, దేవన్న గార్లు నూతనంగా ఎంఈఓగా బాధ్యతలను చేపట్టిన సేవలని ఆత్మీయంగా సన్మానించడం జరిగింది. పాఠశాలను ఉద్దేశించి ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాల పనితీరు ఆదర్శంగా ఉందని ప్రశంసించారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

• ఆనందంగా ఆటలాడిన విద్యార్థులు



ఆటలు ఆడుకుంటున్న విద్యార్థులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రస్తుత సమయంలో చాలా పాఠశాలల్లో విద్యార్థులు ఆటలాడుకునేందుకు ఆయా పాఠశాలల యాజమాన్యాలు సమయాన్ని కేటాయించడం లేదు. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతున్నాయి. కానీ నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రయివేటు పాఠశాల విద్యార్థులు తమకు దొరికిన ఇంటర్వెల్ 10 నిమిషాల సమయంలో ఉల్లాసంగా.. ఉత్సాహంగా ఇలా ఆటలాడుకున్నారు. ఈ చిత్రాన్ని నవతెలంగాణ గురువారం క్లిక్‌మనిపించింది.

పీఓడబ్ల్యు రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి



రాష్ట్ర మహాసభల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

పిఓడబ్ల్యు రాష్ట్ర7వ మహాసభల సందర్భంగా ఈనెల 31న జరిగే ప్రదర్శన, సభను జయప్రదం చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భారతి మహిళలకు పిలుపునిచ్చారు. గురువారం డివిజన్ కమిటీ సమావేశం పట్టణంలోని ఐఎఫ్టియు ఆఫీసులో నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలపై జరుగుతున్న దాడులను ఆపాలని, ఎన్నికల సందర్భంగా మహిళల కోసం ఇచ్చిన మాట రేవంత్‌రెడ్డి సర్కార్ నిలబెట్టుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. పోరాడకుండా మన జీవితాల్లో మార్పు ఉండదని, పోరాట స్ఫూర్తిని పెంచడానికి, మహిళా హక్కుల సాధనకు భవిష్యత్తు కార్యక్రమాన్ని రూపొందించడానికి జరుగుతున్న మహాసభల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆమె కోరారు. బూతు సినిమాలు, అశ్లీల సాహిత్యం, వరకట్న దురాచారాన్ని అరికట్టాలని ప్రభుత్వాన్ని ఆమె డిమాండ్ చేశారు. ఫ్రీబస్సు పథకం విజయవంతానికి మరిన్ని బస్సులు పెంచాలని, మహిళకు నెలకు ఇస్తామన్న 4వేల రూపాయల పథకాన్ని వెంటనే అమలు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆమె కోరారు. 2024 సెప్టెంబర్ 1, 2 తేదీల్లో మహాసభల్లో ప్రొఫెసర్లు, కార్మిక సంఘాల మహిళ నాయకులు పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. సమావేశంలో పిఓ డబ్ల్యు ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి వి పద్మ, నిజామాబాద్ డివిజన్ కార్యదర్శి దేశెట్టి రాధా,మణెమ్మ, లక్ష్మీ, పద్మ ధనలక్ష్మీ, శ్యామల పాల్గొన్నారు.

ఘన్పూర్‌లో యువకుడి హత్య

మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు



మృతుడు కృష్ణ(ఫైల్)

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఘన్‌పూర్ గ్రామ శివారులో నడిపల్లి తాండకు చెందిన బట్టు క్రిష్ణ (25) హత్య చేసినట్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.మల్లేష్, ఎస్‌హెచ్ఓ మహమ్మద్ షరీఫ్ తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నడిపల్లి తాండకు చెందిన బొట్టు క్రిష్ణ బుధవారం వారాంతపు సంతలో సరుకులు తీసుకుంటానని ఇంట్లో చెప్పి, మతుడు తన ఇంటి నుండి బయటకు వెళ్లి, అదే రోజు రాత్రి ఘన్‌పూర్ గ్రామంలో ఉన్న కల్లుబట్టిలో కల్లు సేవించిన అక్కడి నుండి బయటికి వెళ్లిపోయాడు. గురువారం ఉదయం కల్లు బట్టి ఎదురుగా ఉన్న హెచ్ఎ చికెన్ సెంటర్ వద్ద క్రిష్ణ మతి చెంది ఉన్నాడు. ఆయన తల్లి ఫిర్యాదు మేరకు డిచ్ పల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తులో భాగంగా నేర స్థలంలో మతుడిని పరిశీలించగా, మతుడు వీపులో పదునైన ఆయుధంతో పొడిచినట్లుగా మూడు గాయాలు ఉన్నట్లుగా గుర్తించినట్లు వివరించారు. మతుడిని ఎవరో గుర్తు తెలియని వ్యక్తి తాత్కాలిక వివాదంలో గాని, మరి ఏదైనా ఇతర ఘర్షణ కారణం వల్ల మతుడిని గాయపరిచి వెళ్లిపోగా తీవ్ర రక్తస్రావం వల్ల క్రిష్ణ మతి చెందినట్లుగా గుర్తించి నట్లు పేర్కొన్నారు. కేసు దర్యాప్తులో భాగంగా అనుమానితులు, నిందితుల ఆచూకి కొసం పరిశీలన జరుగుతుందని తెలిపారు. కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని మార్చురీకికి తరలించినట్లు తెలిపారు. మతునికి ముగ్గురు పిల్లలు ఉన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావాలి

• రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి • వీసీ ద్వారా కలెక్టర్లు, అధికారులకు దిశానిర్దేశం



పాల్గొన్న కలెక్టర్, అధికారులు



వీసీలో మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్నికల అధికారి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అన్ని విధాలుగా సమాయత్తం కావాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి.పార్థసారథి సూచించారు. ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా క్షేత్రస్థాయిలో ఎన్నికల ప్రక్రియ ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. గురువారం ఆయన జిల్లా కలెక్టర్లు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు, జెడ్పీ సీఈఓలు, డీపీఓలు, ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా స్టేట్ ఎలక్షన్ కమిషనర్ పార్థసారథి మాట్లాడుతూ.. వచ్చే నాలుగైదు నెలల వ్యవధిలో స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తి చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. ముందుగా మూడు దశల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని, అనంతరం ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు, చివరగా మున్సిపల్ ఎన్నికలు జరుగుతాయని వెల్లడించారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై పకడ్బందీగా దృష్టిని కేంద్రీకరించాలని, జిల్లా ఎన్నికల అధికారులైన కలెక్టర్లు ఏర్పాట్లను నిశితంగా పర్యవేక్షణ జరపాలని సూచించారు. శాసనసభ, పార్లమెంటు ఎన్నికలతో పోలిస్తే, పార్టీలకు అతీతంగా జరిగే స్థానిక సంస్థల ఎన్నికలు సున్నితత్వంతో కూడుకుని ఉంటాయని, ఏమాత్రం అజాగ్రత్తకు తావివ్వకుండా, ఎలాంటి ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా ఎన్నికలను నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కమిషనర్ హితవు పలికారు. ఓటరు జాబితా రూపకల్పన, పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్ వంటి ప్రక్రియలను తక్షణమే చేపట్టి నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలన్నారు. సెప్టెంబర్ 6న ఓటరు జాబితా డ్రాఫ్ట్ నోటిఫికేషన్ వెలువరించి అభ్యంతరాలు స్వీకరించాలని, సెప్టెంబర్ 21న తుది ఓటరు జాబితాను వెలువరించాల్సి ఉంటుందన్నారు. తుది ఓటరు జాబితాను వెలువరించడానికి ముందే క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని, ఏవైనా మార్పులు, చేర్పులకు సంబంధించిన అభ్యర్థనలు వస్తే వాటిని పరిశీలించి ఓటరు జాబితాలో చేర్చే అధికారం కేవలం ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు మాత్రమే ఉంటుందని స్పష్టం చేశారు. ఏ చిన్న పొరపాటుకు కూడా ఆస్కారం లేకుండా ప్రతీ దశలోనూ జాగ్రత్తలు తీసుకోవాలని, నిర్లక్ష్యానికి తావివ్వకూడదని జాగ్రత్తలు సూచించారు. పంచాయతీరాజ్ చట్టం-2018 తో పాటు, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించిన నిబంధనలపై పూర్తి అవగాహన ఏర్పరచుకోవాలని, ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు క్రియాశీలక పాత్ర పోషించాలని తెలిపారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఉన్న ఓటరు జాబితాను గ్రామ పంచాయతీల వారీగా రూపొందించుకోవాలని, అర్హులైన ఏ ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుండి గల్లంతు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై చర్చించాలని అన్నారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తిస్తూ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో, పూర్తి పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిపించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఎన్నికల కమిషనర్ పార్థసారథి సూచించారు. ఎంపిడిఓలు తమతమ మండలాల పరిధిలోని పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో సందర్శించి వాటి స్థితిగతులను పరిశీలించేలా చూడాలన్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రం పరిధిలో 600 వరకు ఓటర్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఓటర్ల సంఖ్య 650 దాటితే అదనపు పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. ఒక వార్డులోని ఓటరుకు మరో వార్డులో ఓటు హక్కు ఉండకుండా జాగ్రత్త వహించాలని, ఒకే కుటుంబానికి చెందిన ఓటర్ల ఓటు ఒకేచోట ఉండేలా ఓటరు జాబితాను నిశితంగా పరిశీలించాలని అన్నారు. ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, ప్రతిఒక్కరు తమతమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని, అలసత్వాన్ని ఎంతమాత్రం ఉపేక్షించబోమని కమిషనర్ స్పష్టం చేశారు. బ్యాలెట్ బాక్సులు, ఇతర ఎన్నికల సామాగ్రిని సమకూర్చుకోవాలని, ఎన్నికల నిర్వహణ కోసం అవసరమైన పోలింగ్ సిబ్బందిని గుర్తించి, వారికి శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలని, ర్యాండమైజెషన్ ద్వారా పోలింగ్ కేంద్రాలలో విధులను కేటాయించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా పంచాయతీ కార్యాలయాలతో పాటు మండల స్థాయిలోనూ ప్రత్యేకంగా ఎలక్షన్ సెల్ లను నెలకొల్పి, ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లను పర్యవేక్షించేలా చూడాలని ఎన్నికల కమిషనర్ సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ అంకిత్, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, ట్రైనీ కలెక్టర్ సంకేత్ కుమార్, జెడ్పీ సీఈఓ ఉష, డీపీఓ తరుణ్ కుమార్, ఆర్డీఓలు రాజేంద్రకుమార్, రాజాగౌడ్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

రైతు కుటుంబ నిర్ధారణ సర్వే

•రుణమాఫీపై యాప్‌లో వివరాల నమోదు



కమ్మర్‌పల్లి :వివరాలు నమోదు చేసుకుంటున్న రైతు కుటుంబీకులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి/డిచ్‌పల్లి

మండలంలోని నాగాపూర్‌లో పలు సమస్యలతో నిలిచిపోయిన రుణమాఫీపై ఫీల్డ్ సర్వే గురువారం ప్రారంభమైంది. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో వ్యవసాయ శాఖ సిబ్బంది మండల నోడల్ అధికారిణి రమ్యశ్రీ ఆధ్వర్యంలో సాంకేతిక సమస్యలు ఉన్న రైతుల కుటుంబ సభ్యుల నిర్ధారణ కార్యక్రమాన్ని చేపట్టారు. 2లక్షల రుణమాఫీ కానీ రైతు కుటుంబాలకు సంబంధించిన కుటుంబ సభ్యుల వివరాలను ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్‌లో సిబ్బంది పొందు పరుస్తున్నారు. రుణమాఫీ అందని రైతులు పెద్ద ఎత్తున గ్రామ పంచాయతీ కార్యాలయానికి తరలివచ్చి తమ కుటుంబ సభ్యుల వివరాలను అధికారులకు అందజేస్తున్నారు. వాటిని వ్యవసాయ శాఖ సిబ్బంది ఈ యాప్ లో నమోదు చేస్తున్నారు. కాగా మండలంలో 30న ఉప్లూర్, 31న కమ్మర్‌పల్లి, సెప్టెంబర్ 2న హాస కొత్తూర్, 3న బషీరాబాద్, 4న అమీర్ నగర్, 5న కోన సముందర్, 6న నర్సాపూర్, 9న కోనాపూర్, కొత్తచెరువు తండా, 10న ఇనాయత్ నగర్, దొమ్మరి చౌడు తండా, 11న చౌటపల్లి, 12న బషీరాబాద్, 13న రాజరాజేశ్వరి నగర్ గ్రామాల్లో ఈ కుటుంబ నిర్ధారణ సర్వే జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ మాలిక్ తెలిపారు. రుణమాఫీ కానీ రైతులు ఈ కుటుంబ నిర్ధారణ సర్వేను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



డిచ్‌పల్లి : రైతుల వివరాలు యాప్‌లో నమోదు చేస్తున్న అధికారులు

డిచ్‌పల్లి :మండలంలోని బర్దిపూర్ గ్రామంలోని రైతు వేదికలో గురువారం ప్రభుత్వ ఆదేశానుసారం రైతు రుణమాఫీలో భాగంగా కుటుంబసభ్యుల నిర్ధారణ చేయవలసిన రైతుల వివరాలను యాప్‌లో నమోదు చేయడం జరిగిందని మండల వ్యవసాయ అధికారి సుధామాధురి తెలిపారు. రైతు రుణమాఫీ కాని రైతులు ఎలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు ఆశ్రిత రాజ్, వంశీకృష్ణ, సహకార సొసైటీ చైర్మన్ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 81మంది లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భూపతిరెడ్డి మాట్లాడుతూ.. కచ్చితంగా కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆడబిడ్డలకు మంచి రోజులు వచ్చాయని అన్నారు. కళ్యాణ లక్ష్మి పథకం విషయంలో గత ప్రభుత్వం లాగా పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి నిరుపేదకు అందేలా చూస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ముప్పగంగారెడ్డి, శేఖర్ గౌడ్, బాడ్సి సొసైటీ చైర్మన్ నిమ్మల మోహన్ రెడ్డి, కిరణ్ రావు, గోరుకంటి లింగన్న, గంగా ప్రసాద్, సతీష్ రావు, ప్రతాప్, సతీష్ రెడ్డి, నాయకులు, తాసిల్దార్ రామేశ్వర్ పాల్గొన్నారు.

బైరాపూర్ గ్రామానికి చెందిన కొందరికి కళ్యాణ్ లక్ష్మి ద్వారా వచ్చిన చెక్కులను గురించి తమకు సమాచారం ఇవ్వలేదని తహసీల్దార్‌తో మాట్లాడిన ఎప్పుడు పంపిణీ చేస్తామనేది సరైన తేదీ కూడా తెలపడం లేదని ఆ గ్రామానికి చెందిన వ్యక్తి జలంధర్ నవతెలంగాణ తెలిపారు. నవతెలంగాణ ఎమ్మార్వోకు సంప్రదించగా ఎమ్మెల్యే పర్మిషన్ లేదా ఆర్డిఓ పర్మిషన్ తీసుకున్న తర్వాతనే పంపిణీ చేస్తామని అన్నారు. కాకపోతే మోపాల్ మండల కేంద్రంలో గతంలో సరైన సమయంలో కళ్యాణ్ లక్ష్మీ చెక్కులను పంపిణీ చేయకపోవడం వల్ల ఆ చెక్కుల వ్యాలిడిటీ అయిపోయి మళ్లీ అర్హులకు చెక్కులు తిరిగి రావాలంటే 4 నుండి 5 నెలల సమయం పట్టింది. అదే పునరావృతం కావద్దని తహసీల్దార్‌ను కోరారు.

చలో ఎస్పిడి పోస్టర్ ఆవిష్కరణ



చలో ఎస్పిడి పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాన్‌టీచింగ్ సిబంది

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని కేజీబీవీ, యుఆర్ఎస్, మోడల్ స్కూల్ హాస్టల్స్ నాన్ టీచింగ్, వర్కర్లకు బేసిక్ పే అమలు కోసం, ఇతర డిమాండ్ల పరిష్కారం కోసం ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్, వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయు) ఆధ్వర్యంలో ఈనెల 30న జరిగే చలో ఎస్‌పీడీ(హైదరాబాద్) కార్యాలయం పిలుపును జయప్రదం చేయాలని కేజీబీవీ వద్ద పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ మాట్లాడుతూ.. కేజీబీవీ, యుఆర్ఎస్, మోడల్ స్కూల్, నాన్ టీచింగ్ వర్కర్లకు వెంటనే కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, కాలేజీలుగా అప్ గ్రేడ్ ఐన కేజీబీవీల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సిబ్బందిని నియమించాలన్నారు. రిటర్మెంట్ వయసును 65 ఏళ్లకు పెంచాలని రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని అన్నారు. ఉద్యోగ, ఆరోగ్య భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. వంట పాత్రలు ఇతర సామాగ్రిని సరిపడా కొత్తవి అందించాలన్నారు. డ్యూటీచార్ట్ అమలు చేసి, పనిభారం తగ్గించాలన్నారు. కంప్యూటర్ ఒకేషనల్ ఇన్స్ స్ట్రక్టర్లకు ఫుల్ టైం వేతనాలు ఇవ్వాలన్నారు. ఏఎన్ఎం లకు నైట్ డ్యూటీలు తగ్గించాలన్నారు. నాన్ టీచింగ్ సిబ్బందికి బదిలీలు చేపట్టాలన్నారు. గత, ప్రస్తుత ముఖ్యమంత్రులు ఇచ్చిన హామీ మేరకు నాన్ టీచింగ్, వర్కర్లను రెగ్యులరైజ్ చేసే ప్రక్రియను ప్రారంభించాలన్నారు. జిల్లాలోని అన్ని కేజీబీవీ, యుఆర్ఎస్, మోడల్ స్కూల్ నాన్ టీచింగ్ వర్కర్లు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కేజీబీవీ నాన్ టీచింగ్ సిబ్బంది రమా, ఈశ్వరి, మోతి, విజయమ్మ, శారద, సువర్ణ ఆండాలు, చంద్రకళ, సుజాత, సరోజ, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

విదేశాల్లో చదువుకునే అవకాశం

• స్పాట్ అడ్మిషన్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

సింగపూర్, జర్మనీ, ఫ్రాన్స్‌లోని ప్రముఖ విశ్వవిద్యాలయాల ప్రతినిధులతో భేటీ బీ.టెక్, డిగ్రీ, డిప్లొమా, ఇంటర్మీడియట్ విద్యార్థులు, ఉత్తీర్ణత, ఫెయిల్ అయిన వారందరూ అర్హులని అధ్యయనాల అంతరం అంగీకరించబడిందని, ఎంత కాలం అయినా సరే, పార్ట్ టైమ్ ఉద్యోగం చేస్తూ చదువుకోవడం, చదువు తర్వాత ఉద్యోగావకాశాలు, దేశంలో స్థిరపడే మార్గం. 2024 ఆగస్టు-31న నిజామాబాద్‌లోని బ్లూ రిబ్బన్ నిజామాబాద్ బ్రాంచ్‌లో నిర్వహిస్తారని డైరెక్టర్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. విదేశాల్లో చదువుకొని మీ భవిష్యత్తును తీర్చిదిద్దుకునే అవకాశాన్ని వదులుకోకండని అన్నారు. మిగతా సమాచారం కోసం ఈ ఫోన్ నెంబర్ 770 2345 063 కు సంప్రదించగలరని తెలిపారు.

భారీగా గుట్కా పట్టివేత

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని రెండవ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీగా గుట్కాను పట్టుకున్నట్లు రెండవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ యాసిర్ అర్ఫాత్ గురువారం తెలిపారు. బుధవారం రాత్రి టూ టౌన్ పరిధిలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా పన్నెండు గంటల తరువాత తన సిబ్బంది ఆర్ఆర్ చౌరస్తా దారిలో వెహికల్ చెకింగ్ చేస్తుండగా ఒక ఎర్టిగా కార్ రాగా దానిని ఆపి తనిఖీ చేశారు. ఆ కారులో ప్రభుత్వం నిషేధిత గుట్కా-20 బ్యాగులు, అందులో ఇద్దరు వ్యక్తులు ఉన్నారు. అంకుష్ జాదలవార్, మరో వ్యక్తి శివాజీ గైక్వాడ్. వీరిద్దరు కూడా నాందేడ్ పట్టణానికి చెందినవారు. వీరు నిజామాబాద్ పట్టణానికి చెందిన సుల్తాన్ అనే వ్యక్తి దగ్గర కొని నాందేడ్ పట్టణంలో ఉంటున్న గబాల శుభం అనే వ్యక్తికి సప్లై చేస్తున్నారని తెలిపారు. నిజామాబాద్ పట్టణంలో తక్కువ ధరకు కొని నాందేడ్‌లో ఎక్కువ ధరకి అమ్మి ఎక్కువ లాభం కోసం ఈ వ్యాపారం చేస్తున్నామని వారు తెలిపారని ఎస్ఐ వివరించారు. దీని మొత్తం విలువ 1,24,200౹. నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి ఎర్టిగా కారును, గుట్కా బ్యాగులను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాల కోసం కృషి చేయాలి

• భీంగల్ సిఐ నవీన్ కుమార్
• శ్రీ భాషితలో సందడిగా వెల్కమ్ పార్టీ



మాట్లాడుతున్న సీఐ



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

విద్యార్థులు ఉన్నత లక్ష్యాల కోసం కృషి చేయాలని భీంగల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ నవీన్ కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పద్మశాలి విజయ సంఘం కళ్యాణ మండపంలో స్థానిక శ్రీ భాషిత జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సర విద్యార్థులు మొదటి సంవత్సర విద్యార్థులకు వెల్‌కమ్ పార్టీ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఐ నవీన్ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఇంటర్మీడియట్ అనేది మెయిన్ స్టేజ్ అన్నారు. ఇంటర్మీడియట్ దాటిన వ్యక్తి వార్షిక పరీక్షలు, కాంపిటీటివ్ పరీక్షల్లో పాల్గొని జాబ్ సంపాదించడానికి ప్రధాన భూమిక ఇంటర్ విద్య అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు నృత్య ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ రాజశేఖర్, డైరెక్టర్లు సుంకేట రవి, సిలివెరి సంజీవ్, మలావత్ సంతోష్, లెక్చరర్లు హన్మాండ్లు, సుమన్, సాయన్న, శ్రీనివాస్, గజానంద్, శ్రీధర్, రంజిత్, రాజేష్, శృతి, చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

నసురుల్లాబాద్ స్టేషన్‌కు ఎస్ఐ కావలెను

నవతెలంగాణ-నసురుల్లాబాద్

నసురుల్లాబాద్ పోలీస్ స్టేషన్‌కు గత నెలనుంచి ఎస్ఐ లేకపోవడంతో ప్రజలు పలు రకాలుగా ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో ఇదే పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించిన ఎస్సై లావణ్య దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో ఇన్‌ఛార్జి ఏఎస్ఐ విధులు నిర్వహిస్తున్నారు. పోలీస్ స్టేషన్‌కు ఎస్సై లేకపోవడంతో ఇన్‌ఛార్జ్ ఏఎస్ఐ, ఇతర సిబ్బంది నేరం సమాచారం తెలిసినా.. తమకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు వచ్చే వరకు సరైన చర్యలు తీసుకోవడం లేదని బాధితులు వాపోతున్నారు. స్టేషన్ పరిధిలో కనిష్ట స్థాయిలో కూడా తమ బాధ్యతలు నిర్వహించకుడా ప్రతి చిన్న విషయంలో పై అధికారులు ఆదేశిస్తేనే చర్యలు తీసుకుంటామని సమాధానం ఇస్తున్నట్లు సమాచారం. బోధన్, నిజామాబాద్, బాన్సువాడకు రహదారి మధ్యలో నసురుల్లాబాద్ పోలీస్ స్టేషన్ ఉంది. ఈ స్టేషన్ పరిధిలో తరచూ ప్రమాదాలు, చిన్న చిన్న తగాదాలు జరిగినా.. స్టేషన్‌కు బాధ్యత గల అధికారి లేకపోవడంతో బాధితులకు తక్షణ న్యాయం జరగడం లేదు. ఇప్పటికైనా పై అధికారులు స్పందించి ఎస్ఐని నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని ఐలాపూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు గురువారం నిర్వహించినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు దామోదర్ తెలిపారు. రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బిఎస్‌కె)లో భాగంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్టు వివరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు దామోదర్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం వల్ల విద్యార్థులకు ఆరోగ్యప్రయోజనాలు కలుగుతాయని అన్నారు. 63 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన విద్యార్థులకు మందులు పంపిణీ చేసినట్టు వివరించారు. వైద్యులు డాక్టర్ నిక్కత్, డాక్టర్ క్రాంతికుమార్‌లు పరిశుభ్రత అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఫార్మాసిస్ట్ ఎస్.ఉమారాణి, ఎ.ఎన్.ఎం స్వప్న, ఉపాధ్యాయులు పద్మ, లావణ్య, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రమేష్ చైతన్య

యువత మాదకద్రవ్యాలకు బానిస కావొద్దు

- ఇంపాక్ట్ సర్టిఫైడ్ ట్రైనర్ మోటివేషనల్ స్పీకర్ రమేష్ చైతన్య

నవతెలంగాణ-భిక్కనూర్

మాదకద్రవ్యాలకు అలవాటు పడి యువత జీవితాలను నాశనం చేసుకోవద్దని ఇంపాక్ట్ సర్టిఫైడ్ ట్రైనర్ మోటివేషనల్ స్పీకర్ రమేష్ చైతన్య తెలిపారు. గురువారం మండలంలోని కాచాపూర్ గ్రామంలో జిల్లా ఉన్నత పరిషత్ పాఠశాలలో మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత డ్రగ్స్‌కు అలవాటు పడి మత్తులో సమాజంలో ఎన్నో సంఘ విద్రోహ చర్యలకు పాల్పడుతున్నారని, క్షణికావేశంలో విచక్షణ కోల్పోయి భవిష్యత్తును అంధాకారం చేసుకుంటున్నారని తెలిపారు. జాతీయ నేర గణాంక శాస్త్ర నివేదిక ప్రకారం దాదాపు 75 శాతం రోడ్డు ప్రమాదాలు, ఆత్మహత్యలు, మాన భంగాలు, హత్యలు, తదితర నేరాలకు ముఖ్య కారణం మాదకద్రవ్యాలు తీసుకోవడమేనని నివేదికలు చెబుతున్నాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామచంద్రరావు, ఉపాధ్యాయులు సుభాన్‌రెడ్డి, శైలజ, శేఖర్, చాంగు బాయి, ప్రియా, అరవింద్, పాల్గొన్నారు.

కామారెడ్డి : మాదకద్రవ్యాలతో జరుగుతున్న నష్టాన్ని తెలియజేస్తూ వాటిపట్ల అప్రమత్తతో ఉండాలని విద్యార్థి సేన ఆధ్వర్యంలో డ్రగ్ ఫ్రీ తెలంగాణకై మేముసైతం అంటూ కామారెడ్డి జిల్లా కేంద్రంలో యంగ్ సైరన్ ర్యాలీ, అవగాహన కార్యక్రమం జిల్లా అధ్యక్షులు కే.వినయ్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థి సేన వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు టి.కే.శివప్రసాద్, ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కిష్టయ్య, రాజగంభీర్, ఎన్సిసి సుధాకర్, చంద్రశేఖర్, విద్యార్థి సేన నాయకులు సాయి, రోహిత్, మహేష్, దీపక్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాన్సువాడలో కుక్కలను పట్టుకోరా..?

- స్థానికులపై తరుచూ దాడులు

నవతెలంగాణ-బాన్సువాడ (నసురుల్లాబాద్)



బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో శునకాలు స్వైరవిహారం చేస్తున్నాయి. వీధుల్లో తిరగాలంటే ప్రజలు జంకుతున్నారు. రాత్రుల్లో ఇండ్లకు చేరుకోవాలంటే ఇబ్బందులకు గురవుతున్నారు. గురువారం బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని టీచర్స్ కాలనీ, మదీనా కాలనీలో పదుల సంఖ్యలో కుక్కలు సంచరించడంతో వాహనదారులకూ కష్టాలు తప్పడం లేదు. నడుచుకుంటూ పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు వెంట పడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఉదయం, సాయంత్రం వాకింగ్‌కు వెళ్లే వారి వెంట పడుతున్నాయి. కొన్ని నెలలుగా వీటి బెడద ఎక్కువైంది. జీపీ పాలకవర్గం, అధికారులు స్పందించి శునకాల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు చేపడుతున్నాం

ఉన్నతాధికారుల ఆదేశాలు రాగానే కుక్కలను పట్టుకొని వాటికి కుటుంబ నియంత్రణ చేసేందుకు చర్యలు చేపట్టనున్నాం. కుక్కలతో ప్రజలకు ఇబ్బంది కాకుండా చూడాలని మున్సిపల్ సిబ్బందికి ఆదేశించాం.

– మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు

అర్హుడైన ప్రతి ఒక్క రైతుకూ రుణమాఫీ వర్తించేలా చేస్తాం

- కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు శ్రీధర్ గౌడ్

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

అర్హులైన ప్రతి రైతుకూ రుణమాఫీ వర్తించేలా కృషి చేస్తామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్ గౌడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాగిరెడ్డిపేట మండల వ్యాప్తంగా రుణమాఫీ కానీ రైతులకు రుణమాఫీ వర్తించేలా ప్రణాళిక సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు.

అభివృద్ధి పథంలో ఎల్లారెడ్డి..

ఎల్లారెడ్డి నియోజక వర్గం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఆధ్వర్యంలో అభివృద్ధి పథంలో కొనసాగుతుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. 90 లక్షల ప్రతిపాదలతో ఆర్టీసీ బస్టాండ్‌ను అభివృద్ధి చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. అచ్చాయిపల్లి బీటీ రోడ్డు కొరకు మూడు కోట్ల రూపాయలు మంజూరు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. జలాల్పూర్ ఎర్రరం బీటీ రోడ్డుకు రెండు కోట్ల రూపాయలు నరసన్న పల్లి తండా రోడ్డుకు 55 లక్షల రూపాయలు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాగిరెడ్డిపేట్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షులు ఇమామ్, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దివిటీ కిష్టయ్య, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీరామ్‌గౌడ్, సురేందర్‌గౌడ్, మురళి గౌడ్, ఫరూక్ సాబ్, కృష్ణ, మంత్రి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు పాటించాలి

- మెడికల్ అధికారి యేమిమా

నవతెలంగాణ-భిక్కనూర్

ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు పాటించాలని మెడికల్ అధికారి యేమిమా తెలిపారు. గురువారం పట్టణ కేంద్రంలోని హరిజనవాడ కాలనీలో, సిద్ధ రామేశ్వరనగర్ గ్రామంలో గురుకుల పాఠశాలలో మెడికల్ హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేసి గ్రామ ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. హరిజనవాడ కాలనీలో 52 మందిని వైద్య పరీక్షలు నిర్వహించగా సాధారణ వ్యాధులు ఉన్నవారికి మందులు పంపిణీ చేశారు. టీహబ్‌కు 6 గురు వ్యక్తుల రక్త నమూనాలు పంపించినట్లు తెలిపారు. 8 మందికి మలేరియా, డెంగ్యూ వ్యాధి నిర్ధారణ కొరకు ఆర్ డిటిటెస్ట్‌లు చేయగా ఏ ఒక్కరికి వ్యాధి నిర్ధారణ కాలేదని తెలిపారు. 45 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ ఈఓ వెంకటరమణ, ఎంఎల్‌హెచ్‌పి పూజ, ఏఎన్ఎంలు మంజుల, యాదమ్మ, మాధవి, ఆశావర్కర్లు రేణుక, మమత, నీలిమా, అనురాధ, ఆండాలు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రఘు, వైస్ ప్రిన్సిపాల్ హనుమాన్లు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

విద్యార్థులకు బ్యాగులు పంపిణీ

నవతెలంగాణ-బోధన్

మాజీ ఎమ్మెల్యే షకీల్ అమీర్ సతీమణి అయేషా ట్రస్ట్ అధినేత అయేషా ఫాతిమా పుట్టిన రోజు సందర్భంగా 24వ, 18వ వార్డులలో బీఆర్ఎస్ నాయకులు ప్రైమరీ స్కూల్‌లలో విద్యార్థులకు స్కూల్ బ్యాగులను గురువారం పంపిణీ చేశారు. అనంతరం పిల్లలతో కలసి కేకు కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బెంజర్ గంగారాం, కౌన్సిలర్ సుధారాణి, తెరాస నాయకులు ముబిన్ ఖాన్, అహ్మద్, నాగుల రవిశంకర్ గౌడ్, సాగర్, నసీర్, ప్రవీణ్ నాయక్, నరేష్ కుమార్, దేవ, తదితరులు పాల్గొన్నారు.

రెంజల్ : బోధన్ మాజీ శాసనసభ్యులు మహమ్మద్ షకీల్ అమీర్ సతీమణి అయేషా ఫాతిమా జన్మదిన పురస్కరించుకుని బిఆర్ఎస్ నాయకులు పాఠశాల బాల బాలికలకు స్కూల్ బ్యాగులను అందజేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు శేషుగారి భూమారెడ్డి, కాశం సాయిలు, తెలంగాణ శంకర్, యువ నాయకుడు పిల్లల ప్రవీణ్, అవేజ్, ముకీద్, జలీలుద్దీన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపి, ఉపాధ్యాయ బృందం, తదితరులు పాల్గొన్నారు.



బ్యాగులు పంపిణీ చేస్తున్న దృశ్యం

రేషన్ కార్డ్‌లేని రైతులకు కొత్త యాప్

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్, వేంపల్లి, నల్లూర్, కొత్తపల్లి గ్రామాలకు చెందిన రైతులకు సంబంధించి రేషన్ కార్డ్ లేని రైతుల కోరకు రైతు భరోసా యాప్ ఇచ్చారని మండల వ్యవసాయాధికారి సాయికృష్ణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ యాప్ ద్వారా రైతుల కుటుంబ సభ్యుల నిర్ధారణ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. కావున రేషన్ కార్డు లేని రైతులు ధ్రువీకరణ పత్రం నింపి కుటుంబ సభ్యుల ఆధార్ కార్డు జిరాక్స్‌తోపాటు ఫ్యామిలీ సభ్యులతో ఫోటో అప్లోడ్ చేసి ఇవ్వాలని సూచించారు. ఆయా గ్రామాల రైతులు శుక్రవారం ముప్కాల్ రైతు వేదిక వద్దకు రావాలని విజ్ఞప్తి చేశారు. ఏమైనా సందేహాలు ఉంటే ఏఈవోలను సంప్రదించాలని తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- ఎంపీడీవో లక్ష్మి కాంత్ రెడ్డి



మురికి కాలువలను శుభ్రం చేయిస్తున్న ఎంపీడీవో

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో లక్ష్మీ కాంత్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కస్లాబాద్ గ్రామంలో శానిటైజింగ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని ప్రతి గ్రామంలో మురికి కాలువలను శుభ్రపరుస్తూ గ్రామంలో శానిటైజింగ్ పనులను చేపడుతున్నామని ఇటీవల కురుస్తున్న వర్షాలతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరిసర ప్రాంతాలలో నీటిని నిల్వ ఉండకుండా చూసుకోవాలని, లేదంటే నీటిలో దోమలు వృద్ధి చెందే ప్రమాదం ఉందన్నారు. నీటి ద్వారా వచ్చే వ్యాధులను గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ జ్యోతి, గ్రామ పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అతిథి ఉపాధ్యాయ పోస్టుల నియమానికి దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో మహిళా అభ్యర్థుల నుంచి అతిథి ఉపాధ్యాయ పోస్టుల నియమకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఇన్చార్జి ప్రిన్సిపాల్ సునీత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా పాఠశాలలో 2 టీజీటీ మ్యాథ్స్, 01 టీజీటీ సోషల్, 01 పీఈటి పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు పేర్కొన్నారు. అభ్యర్థులు తగిన అర్హతతో కూడిన ధ్రువీకరణ పత్రాలతో పాటు డెమో ద్వారా ప్రతిభ గల అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్టు తెలిపారు. ఈ డెమోను శుక్రవారం 11 గంటల సమయం నుంచి ప్రారంభమై మధ్యాహ్నం 3:00 వరకు నిర్వహించనున్నట్టు వివరించారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

- ఆర్డీవో రమేష్ రాథోడ్



వివరాలను అడిగి తెలుసుకుంటున్న ఆర్డీవో

నవతెలంగాణ-బాన్సువాడ(నసురుల్లాబాద్)

అర్హులైన యువతీ యువకులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని ఆర్డీవో రమేష్ రాథోడ్ సూచించారు. గురువారం మండలంలోని బోర్లంలో ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టారు. ఇంటింటికి తిరిగి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2025 జనవరి1 నాటికి 18 ఏళ్ల నిండే వారందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. చనిపోయిన వారి పేర్లను లిస్టులో నుంచి తొలగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వరప్రసాద్, పంచాయతీ కార్యదర్శి సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అయోషా ఫాతిమాకు జన్మదిన శుభాకాంక్షలు

నవతెలంగాణ-ఎడపల్లి

బోధన్ మాజీ శాసనసభ్యులు మహమ్మద్ షకిల్ అమీర్ సతీమణి ఫాతిమా అయోషా బేగంకు మండలంలోని మంగళ్‌పహాడ్ మాజీ ఎంపీటీసీ సభ్యురాలు అరుగుల వనజ నాగరాజు పుష్పగుచ్చాన్ని అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

అన్న బహు సాటే జయంతి వేడుకలు



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పలువురు

నవతెలంగాణ-మద్నూర్

మండలంలోని లచ్చన్ గ్రామంలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్న బహు సాటే జయంతి వేడుకలను గురువారం నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో విగ్రహాన్ని ఏర్పాటు చేసే స్థలంలో అన్న బహు సాటే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ ప్రముఖులు మాట్లాడుతూ.. అన్న బహు సాటే అందించిన సేవలు గురించి కొనియాడారు.

తలసేమియా సికెల్‌సెల్ రాష్ట్రస్థాయి పురస్కారానికి డాక్టర్ బాలు ఎంపిక

నవతెలంగాణ-కామారెడ్డి



తలసేమియా సికెల్‌సెల్ రాష్ట్రస్థాయి పురస్కారానికి కామారెడ్డికి చెందిన డాక్టర్ బాలు ఎంపికయ్యారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం మెగా రక్తదాన శిబిరాలను నిర్వహించి 3500లకు యూనిట్లకుపైగా రక్తాన్ని సేకరించడం, తలసేమియా వ్యాధి గురించిన అవగాహన కల్పించినందుకు, తలసేమియా సికిల్‌సెల్ సొసైటీ హైదరాబాద్ వారు సెప్టెంబర్ 1 ఆదివారం తల సేమియా సికెల్‌సెల్ రాష్ట్రస్థాయి పురస్కారాన్ని అందజేయనున్నట్టు ఐవీఎఫ్ సేవాదళ రాష్ట్ర చైర్మన్, రెడ్‌క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు తెలియజేశారు. ఈ అవార్డు రావడానికి సహకరించిన రక్తదాతలకు, కళాశాలల యాజమాన్యాలకు, మీడియా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

అక్టోబర్ 2న సభ్యత్వ నమోదు ప్రారంభిస్తాం

నవతెలంగాణ-మద్నూర్

బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా అక్టోబర్ 2న మండలంలో గ్రామగ్రామాన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని మండలాధ్యక్షులు తెప్పవార్ తుకారాం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

కంటి చూపు ఆపరేషన్ కోసం రూ.25వేలు సాయం

నవతెలంగాణ-పోతంగల్

మండలంలోని జల్లాపల్లి ఫారంలో నివసించే డి.రాంచందర్ అనే వ్యక్తి ఒకే కన్నుతో తన నిత్యజీవితం ఒక సవాలుగా తయారైంది. ఆ కన్నులో కంటిశుక్లం ఏర్పడి కంటిచూపు సరిగాలేక కంటి ఆపరేషన్ చేయడానికి అవసరమైన రూ.25 వేలు సహాయాన్ని లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్ అధ్యక్షులు తెల్ల రవి కుమార్, ప్రధాన కార్యదర్శి హన్మంత రావు, కోశాధికారి సంతోష్, సభ్యులు యోగేష్, శ్రీకాంత్ తదితరులు తమ మానవత్వాన్ని చాటుకున్నారు.

సెప్టెంబర్ 1న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- తెలంగాణ ఎంప్లాయిస్ గెజిటెడ్ ఆఫీసర్స్, టీచర్స్, వర్కర్స్, పెన్షనర్స్ అసోసియేషన్ (టీఈజీ జేఏసీ)

నవతెలంగాణ-కామారెడ్డి

సెప్టెంబర్ 1న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ ఎంప్లాయిస్ గెజిటెడ్ ఆఫీసర్స్, టీచర్స్, వర్కర్స్, పెన్షనర్స్ అసోసియేషన్ (టీఈజీ జేఏసీ) నాయకులు పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని పెన్షనర్స్ భవనంలో టీఈజీ జేఏసీ భాగస్వామ్య సంఘాల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఉద్యోగుల పాలిట శాపంగా మారిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానానికి నిరసనగా సెప్టెంబర్ 1న స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తూ నిరసన ప్రదర్శన నిర్వహించాలని స్టీరింగ్ కమిటీ నిర్ణయించిందని టీఈజీ జేఏసీ నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీఈజీ జేఏసీ భాగస్వామ్య సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పలువురు

వృద్ధాప్య ఉచిత వైద్య శిబిరం



వృద్ధాప్య వైద్యశిబిరంను ప్రారంభిస్తున్న వైద్యులు

నవతెలంగాణ-పోతంగల్

మండల కేంద్రంలో వృద్ధుల కొరకు వృద్ధాప్య వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. శిబిరానికి హాజరైన సీనియర్ సిటిజన్‌ను ఉద్దేశించి డా.కరణ్, డా.రాధిక మాట్లాడారు. వారికి పలు సూచనలు చేశారు. వారికి అవసరమైన వైద్య పరీక్షలు చేసి, కావలసిన మందులు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది, డా.శ్రావ్య, పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలు పూడ్చివేత

- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు



గంతల పూడ్చివేత

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ సమీపంలో గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం గుంతలను పూర్తి చేశారు. అంబేద్కర్ చౌరస్తా నుంచి బాలుర ఉన్నత పాఠశాల వరకు ప్రధాన రహదారి మధ్యలో డివైడర్ కోసం తీసిన గుంత ఏర్పడింది. రోజువారీ వాహనదారులు ప్రయాణికులు గుంతలో పడి పలుసార్లు ప్రమాదాలు జరిగాయి. వర్షం కురిస్తే గుంతలో నీరు చేరుకొని బురదమయంగా మారడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని పలువురు గ్రామపంచాయతీకి సూచించడంతో గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రవణ్ కుమార్, మండల ప్రత్యేక అధికారి ఆదేశాను సారం గుంతలో మొరంవేసి చదును చేశారు. దీంతో ప్రయాణికులు వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు. గుంతలు పూడ్చడంతో హర్షం వ్యక్తం చేశారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండలంలోని వడ్లం గ్రామంలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను ఇన్చార్జ్ ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రెడ్డి గురువారం పరిశీలించారు. గత నాలుగు సంవత్సరాల క్రితం ఆన్‌లైన్ మీ సేవలో ఎల్ఆర్ఎస్ కోసం ప్లాట్ల లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకోగా, వాటికి సంబంధించి అధికారులు పరిశీలించారు. ప్లాట్ల కొలతలు, పరిధిని పరిశీలించినట్లు ఇన్చార్జి ఎంపీడీవో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల ప్లాట్లు, తదితర ఆస్తులకు సంబంధించి ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు చేసుకోవాలని, కొలతలు, పరిధి ప్రకారం సంబంధిత అధికారులతో కలిసి పరిశీలిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ శివాజీ, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.